

# విభారె
## తెలుగు దినపత్రిక
## VIBHARE TELUGU DAILY







PUBLISHED FROM KURNOOL  ఎడిటర్: ఆవుల విజయ భాస్కర రెడ్డి  శనివారం 22 జనవరి 2022  సంపుటి: 03  సంచిక: 142  పేజీలు: 4  వెల: రూ 3-00


# గుడివాడలో ఉద్రిక్త పరిస్థితులు

**టిడిపి నేతలను అడ్డుకున్న పోలీసులు**
**నిజనిర్ధారణ కమిటీ సభ్యులకు అనుమతి నిరాకరణ**
**టిడిపినేత బోండా ఉమ కారు ధ్వంసం**
**వైసిపి, టిడిపి కార్యకర్తల పరస్పర దాడులు**
**భారీగా మొహరించిన పోలీసులు**



గుడివాడ,జనవరి21(): మంత్రి కొడాలి నాని సొంత నియోజకవర్గం కృష్ణా జిల్లా గుడివాడలో ఉద్రిక్త వాతావరణం నెలకొంది. కె కన్వెనషన్ సెంటర్ తనిఖీకి టిడిపి నిజనిర్ధారణ బృందం బయలుదేరగా అనుమతి లేదంటూ పోలీసులు అడ్డుకున్నారు. దీనికితోడు టిడిపి కార్యకర్తలను ఎక్కడికక్కడే అరెస్ట్ చేసి పోలీస్ స్టేషన్లకు తరలించారు. ఈ క్రమంలో గుడివాడలో శుక్రవారం భారీగా పోలీసులు మోహరించారు. సంక్రాంతికి క్యాసినో నిర్వహించడంపై టిడిపి నిజనిర్ధారణ కమిటీ శుక్రవారం అక్కడ పర్యటించడానికి రావడంతో వైసిపి – టిడిపి వర్గాల మధ్య పరస్పర దాడులకు కారణమయ్యింది. ఈ క్రమంలో ఎలాంటి అవాంఛనీయ ఘటనలు జరగకుండా పోలీసులు భారీ బందోబస్తు ఏర్పాటు చేశారు. ప్రధాన రహదారిపై బారికేడ్లను ఏర్పాటు చేశారు. రోప్‌పార్టీ పోలీసులను రంగంలోకి దించారు. దీంతో గుడివాడలో టెన్షన్ వాతావరణం నెలకొంది. కేసినో వ్యవహారంపై నిగ్గు తేల్చేందుకు టీడీపీ నిజనిర్ధారణ కమిటీ గుడివాడ చేరుకుంది. దీంతో గుడివాడ టీడీపీ కార్యాలయం దగ్గర ఉద్రిక్తత నెలకొంది.

# పీఆర్సీ సహా పలు కీలక అంశాలకు కేబినెట్ ఆమోదం

అమరావతి: ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అధ్యక్షతన సచివాలయంలో శుక్రవారం ఉదయం ప్రారంభమైన రాష్ట్ర మంత్రివర్గం సమావేశం ముగిసింది. ఈ సమావేశంలో పలు కీలక అంశాలపై చర్చించి నిర్ణయాలు తీసుకున్నారు. పీఆర్సీ సహా పలు కీలక అంశాలకు కేబినెట్ ఆమోదం తెలిపింది. ఉద్యోగులు రిటైర్మెంట్ వయసు 62 ఏళ్లకు పెంచుతూ తీసుకున్న నిర్ణయానికి కేబినెట్ ఆమోద ముద్ర వేసింది. ఉద్యోగులకు జగనన్న టౌన్‌షిప్ లలో ఇళ్ల స్థలాల కేటాయింపు ప్రతిపాదనకు ఆమోదం తెలిపిన కేబినెట్.. టౌన్‌షిప్‌లలో 10 శాతం ప్లాట్లు 20 శాతం రిబెట్ తో ఇవ్వాలని నిర్ణయం తీసుకుంది.భేటీ ముగిసిన తర్వాత మంత్రి పేర్ని నాని.. కేబినెట్‌లో తీసుకున్న నిర్ణయాలను మీడియాకు వెల్లడించారు. రైతుల నుండి ధాన్యం కొనుగోళ్ల కోసం రూ. 5 వేల కోట్లు కేటాయించినట్లు చెప్పిన మంత్రి.. ధాన్యం కొనుగోలు చేసిన 21 రోజుల్లో రైతుకు నగదు చెల్లింపు ఉంటుందన్నారు.క్యాబినెట్ నిర్ణయాలు

ఈబీసీ నేస్తం అమలుకు క్యాబినెట్ ఆమోదం
ఈనెల 25న ఈబీసీ నేస్తం పథకానికి సీఎం జగన్ శ్రీకారం
16 వైద్య కళాశాలల నిర్మాణానికి కేబినెట్ ఆమోదం
ఇప్పటికే ఉన్న 11 వైద్య కళాశాలల అభివృద్ధికి కేబినెట్ ఆమోదం
వైద్య కళాశాలలకు రూ, 7,880 కోట్లు ఖర్చు చేసేందుకు ఆమోదం
ప్రస్తుత వైద్య కళాశాలల అభివృద్ధికి రూ. 3,820 కోట్లు కేటాయింపు



గ్రామీణ ప్రాంతాల్లో వాయిదాల్లో ఓటీఎస్ చెల్లింపునకు ఆమోదం
రైతుల నుండి ధాన్యం కొనుగోళ్ల కోసం రూ. 5 వేల కోట్లు
ధాన్యం కొనుగోలు చేసిన 21 రోజుల్లో రైతుకు చెల్లింపు
ఉద్యోగుల నూతన పీఆర్సీకి ఆమోదం
కోవిడ్‌తో చనిపోయిన ఉద్యోగుల కుటుంబాలకు కారుణ్య నియామకం
అగ్రవర్ణాల పేద మహిళలకు 45 వేలు ఆర్థిక సహాయం
ఏటా 15 వేలు చొప్పున 45 ఏళ్ళ నుండి 60 ఏళ్ల మధ్య పేద మహిళలకు ఇవ్వాలని క్యాబినెట్ నిర్ణయం
కిదాంబి శ్రీకాంత్ స్పోర్ట్స్ అకాడమీకి తిరుపతిలో ఐదెకరాల భూమి కేటాయింపు
విశాఖలో అదాని డేటా సెంటర్‌కు భూ కేటాయింపు ప్రతిపాదనకు ఆమోదం
వన్ డిస్ట్రిక్ట్–వన్ మెడికల్ కాలేజీ ప్రతిపాదనకు కేబినెట్ ఆమోదం

ఉద్యోగులతో సంప్రదింపులకు కమిటీఉద్యోగులతో సంప్రదింపులకు కమిటీ వేయాలని నిర్ణయం తీసుకున్నారు. దీనిలో భాగంగా మంత్రులు బుగ్గన రాజేంద్రనాథ్, బొత్స సత్యనారాయణ, పేర్ని నాని, ప్రభుత్వ సలహాదారు సజ్జల రామకృష్ణారెడ్డి, సిఎస్ సమీర్ శర్మలను కమిటీలో సభ్యులుగా చేర్చారు. ఉద్యోగులకు వాస్తవ పరిస్థితులు వివరించి, అపోహలు తొలగించేందుకు ఈ కమిటీ ఏర్పాటు చేశారు.

# ఉద్యోగసంఘాల భేటీలో కీలక నిర్ణయాలు

అమరావతి: పీఆర్సీపై ఏకపక్ష జీవోలు జారీ చేసిన సర్కారుపై 'సమ్మె అస్త్రం' ప్రయోగించేందుకు ఉద్యోగ సంఘాలు సిద్ధమవుతున్నాయి. వేర్వేరు సంఘాలన్నీ ఉమ్మడిగా కలిసి వచ్చి... ఉద్యమించాలని నిర్ణయించుకున్నాయి. పీఆర్సీపై ఎవరికి వారుగా కాకుండా... సంఘాలన్నీ ఉమ్మడిగా ఉద్యమించాలని పలు ఉద్యోగ సంఘాలు ప్రతిపాదించాయి. ఈ నేపథ్యంలోనే ఉద్యోగసంఘాలు భేటీ అయ్యాయి. ఈ సమావేశంలో కీలక నిర్ణయాలు తీసుకున్నారు. ఫిబ్రవరి 7 నుంచి ఉద్యోగుల నిరవధిక సమ్మె చేయాలని నిర్ణయం తీసుకున్నారు. సోమవారం ఉద్యోగ సంఘాలు సమ్మె నోటీసులు ఇవ్వనున్నాయి.

ఉద్యోగసంఘాల భేటీలో కీలక నిర్ణయాలు
ఈ నెల 23న జిల్లా కేంద్రాల్లో రౌండ్ టేబుల్ సమావేశాలు
ఈ నెల 25న జిల్లా కేంద్రాల్లో ర్యాలీలు, ధర్నాలు
ఈ నెల 26న అంబేద్కర్ విగ్రహానికి వినతిపత్రాల సమర్పణ
ఈ నెల 27 నుంచి 30 వరకు ఉద్యోగుల నిరాహార దీక్షలు
ఫిబ్రవరి 3న చలో విజయవాడ
ఫిబ్రవరి 5 నుంచి సహాయ నిరాకరణ



# ఇంధన భద్రత కోసం చర్యలు తీసుకోవాలి

**దేశీయంగా చమురు ఉత్పత్తిని సమీకరించాలి**
**ఉపరాష్ట్రపతి వెంకయ్యనాయుడు సూచన**



విశాఖపట్నం,జనవరి21): భారతదేశ ఇంధన భద్రతకోసం దేశీయంగా చమురు ఉత్పత్తిని పెంచాల్సిన అవసరం ఉందని ఉపరాష్ట్రపతి వెంకయ్యనాయుడు అన్నారు. పెట్రోకెమికల్ రంగంలో పరిశోధన, అభివృద్ధికి మరింత ప్రాధాన్యత కల్పించాల్సిన అవసరం ఉందన్నారు. పెట్రోలియం రంగంలో నైపుణ్యం కలిగిన మానవ వనరుల అభివృద్ధికి మరింత కృషి జరగాలని, దానికి ప్రభుత్వాలు కృషి చేయాలని ఉపరాష్ట్రపతి పిలుపునిచ్చారు. పరిశ్రమలు, విశ్వవిద్యాలయాల మధ్య అనుసంధానం అత్యంత కీలకమని వెంకయ్యనాయుడు ఈ సందర్భంగా పేర్కొన్నారు. పునరుత్పాదక విద్యుత్ ఉత్పత్తిపై ప్రత్యేక శ్రద్ధ వహించాల్సిన అవసరం ఉందన్నారు. కరోనా విస్తరిస్తున్న నేపథ్యంలో కరోనా టీకా అందరూ వేసుకోవాలని, ఆస్పత్రిలో చేరాల్సిన పరిస్థితుల నుంచి ప్రజలు తమను తాము రక్షించుకోవాలని వెంకయ్యనాయుడు కోరారు. పెట్రోలియం పరిశోధనలో ఐఐపీఈ పాత్ర కీలక భూమిక పోషించాలని భారత ఉప రాష్ట్రపతి వెంకయ్యనాయుడు ఆకాంక్షించారు. విఎంఆర్డీఏ చిల్డ్రన్స్ ఏరినాలో ఐఐపీఈ తొలి వార్షికోత్సవంలో పాల్గొన్న ఆయన మాట్లాడుతూ హైడ్రోకార్బన్ల పరిశోధనల్లో మరింత పురోగతి అవసరమని, చమురు వినియోగంలో భారత్ మూడవ స్థానంలో ఉందన్నారు. ఈ అంశంలో ఇండియా స్వావలంబన సాధించాలన్నారు. సోలార్, విండ్, టైడల్ ఎనర్జీలను ప్రత్యామ్నాయ వనరులుగా అభివృద్ధి చేసుకోవాలని, స్వయంసమృద్ధే ఆత్మ నిర్భర్ భారత్ లక్ష్యమని పేర్కొన్నారు. దేశంలో ప్రైవేటు పెట్టుబడులు పెరుగుతున్నాయని, ఇది మంచి సంకేతమన్నారు. ప్రత్నామ్నాయ ఇంధన వనరులు అభివృద్ధిలో యువత పరిశోధనలు జరపాలని సూచించారు. కోవిడ్ వ్యాక్సినేషన్ల డ్రైవ్‌లో భారతదేశం అతిపెద్ద ప్రక్రియను చేపట్టిందన్నారు. ఆరోగ్యం పట్ల ఎవరికి వారు స్వీయ బాధ్యత వహించాలని వెంకయ్య నాయుడు అన్నారు.

# కొత్త పీఆర్సీకి కేబినెట్ ఆమోదం: పేర్నినాని



అమరావతి: ఉద్యోగుల కొత్త పీఆర్సీకి కేబినెట్ ఆమోదం తెలిపిందని మంత్రి పేర్నినాని తెలిపారు. శుక్రవారం ఆయన మీడియాతో మాట్లాడుతూ కొత్త పీఆర్సీ ప్రకారమే జీతాలు ఇవ్వాలని నిర్ణయం తీసుకున్నామని తెలిపారు. ఉద్యోగ సంఘాలకు నచ్చజెప్పేందుకు కమిటీ ఏర్పాటు చేశామని పేర్కొన్నారు. ఐదుగురు సభ్యులతో కమిటీ ఏర్పాటు చేశామని వివరించారు. కమిటీలో ప్రభుత్వ సలహాదారు సజ్జల రామకృష్ణారెడ్డి, మంత్రులు బొత్స సత్యనారాయణ, పేర్నినాని, బుగ్గన రాజేంద్రనాథ్‌రెడ్డి, సీఎస్ ఉంటారని మంత్రి తెలిపారు. ఉద్యోగుల రిటైర్‌మెంట్ వయసును 62 ఏళ్లకు పెంచుతూ కేబినెట్ నిర్ణయం తీసుకుందని, కరోనా దృష్ట్యా కాంట్రాక్ట్ పద్ధతిలో వైద్యుల నియామకానికి ఆమోదం తెలిపామని పేర్నినాని వివరించారు.

# గుడివాడలో టీడీపీ నేతలపై దాడి దుర్మార్గం: అచ్చెన్న

అమరావతి: గుడివాడలో టీడీపీ నేతలపై దాడి దుర్మార్గమని ఆ పార్టీ నేత అచ్చెన్నాయుడు తప్పుబట్టారు. శుక్రవారం ఆయన మీడియాతో మాట్లాడుతూ గంజాయి బ్యాచ్‌ను అడ్డుపెట్టుకుని టీడీపీ నేతలపై హత్యాయత్నం చేశారని మండిపడ్డారు. గుడివాడను మట్కా, వ్యసనాలకు కేంద్రంగా మార్చేశారని దుయ్యబట్టారు. కేసినో గుట్టు బయట పడుతుందనే భయంతోనే గుడివాడ గుట్కా బ్యాచ్ వీరంగం సృష్టించిందని మండిపడ్డారు. కొడాలి నాని కోడె త్రాచులా యువతను నాశనం చేస్తున్నాడని, మంత్రిగా కొనసాగే నైతిక అర్హత ఆయనకు లేదన్నారు.



**'కాసినో' వ్యవహారం నిరూపిస్తే రాజకీయాలు వదిలేస్తా..**

# లేకుంటే మీరేం చేస్తారు?: మంత్రి కొడాలి నాని



అమరావతి: మంత్రి కొడాలి నానికి చెందిన కే కన్వెన్షన్ సెంటర్‌ను ప్రధాన ప్రతిపక్షం టీడీపీ టార్గెట్ చేసిన విషయం తెలిసిందే. నిజనిర్ధారణ పేరుతో టీడీపీ నేతలు కొందరు గుడివాడకు వెళ్లి ఉద్రిక్తలతో ప్రశాంతతను దెబ్బతీస్తున్నారు. ఈ నేపథ్యంలో ఆరోపణలపై, టీడీపీ తీరుపై మంత్రి కొడాలి నాని శుక్రవారం తీవ్రంగా స్పందించారు.కే కన్వెన్షన్‌లో కాసినోలు, పేకాట వంటివి నిర్వహించినట్టు నిరూపిస్తే రాజకీయాలు వదిలేస్తానని, అవసరమైతే చావడానికైనా సిద్ధమంటూ టీడీపీకి సవాల్ విసిరారు కొడాలి నాని. వర్ల రామయ్య లాంటి సత్తా లేని నేతలను నిజనిర్ధారణకు పంపారంటేనే టీడీపీ స్టాండర్డ్ ఏంటో తెలుస్తోంది. తన కన్వెన్షన్ ఎలాంటిదో చెప్పడానికి గుడివాడ ప్రజలు ఉన్నారని.. టీడీపీ నుంచి నిజనిర్ధారణ కమిటీ లాంటివి సర్టిఫికెట్ అవసరం లేదని అన్నారు. అవసరమైతే ఏం జరుగుతుందో మీడియా వెళ్లి చూస్కోవచ్చని చెప్పారు.పైగా గుడివాడలో ఏదో జరుగుతోందని సమాచారం అందిన వెంటనే తానే డీఎస్పీకి ఫోన్ చేసి అడ్డుకున్నానని చెప్పారు. చంద్రబాబుకు, నారా లోకేశ్‌కు కాసినోలు బాగా తెలుసని అన్నారు. చంద్రబాబు టైమ్ అయిపోయిందని, మహిళలను అడ్డం పెట్టకుని రాజకీయాలు చేసే ఘనత టీడీపీ మాత్రమే చెందుతుందని మంత్రి కొడాలి నాని ఎద్దేవా చేశారు.

# మంత్రి కొడాలి నాని తీరు దారుణం

**గుడివాడను జూద కేంద్రంగా మార్చారు**
**మండిపడ్డ టిడిపి నేతలు కొల్లు రవీంద్ర, నారాయణరావు**

విజయవాడ,జనవరి21): మంత్రి కొడాలి నాని జూదక్రీడలు ప్రజలకు శాపంగా పరిణమించాయనిమాజీ మంత్రి కొల్లు రవీంద్ర, మాజీ ఎంపీ నారాయణ రావు సంచలన వ్యాఖ్యలు చేశారు. గుడివాడలో మీడియాతో మాట్లాడిన వారు మంత్రి కొడాలి నానిపై విరుచుకుపడ్డారు. కొడాలినాని నిర్వహిస్తున్న జూద క్రీడలు బయట పడతాయన్న భయంతోనే టీడీపీ నిజనిర్ధారణ కమిటీని అడ్డుకునేందుకు వైసీపీ నాయకులు ప్రత్నిస్తున్నారని నారాయణరావు అన్నారు. అధికారంలోకి వచ్చి రెండున్నర ఏళ్లు గడుస్తున్నా ఇప్పటి వరకు ఎటువంటి సమావేశాలు నిర్వహించని మంత్రి నాని, నేడు కే కన్వెన్షన్‌లో ఎస్సీ సెల్ సమావేశం నిర్వహించడం, అతని భయాన్ని తెలియజేస్తుందని నారాయణరావు అభిప్రాయపడ్డారు. టీడీపీలో క్రమశిక్షణతో ఉన్న మంత్రి కొడాలి నాని, వైసీపీలోకి వెళ్లిన తర్వాతే బూతుల మంత్రి, పేకాట మంత్రిగా బాగా పేరుగడించారని కొల్లు రవీంద్ర అన్నారు.ఆదిలోనే ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి స్పందించి ఉంటే పరిస్థితి ఇప్పుడు ఇంతవరకు వచ్చేది కాదన్నారు. ప్రస్తుతం క్యాసినో మంత్రిగా పేరు గడించిన నాని అరాచకం భవిష్యత్తులో ఏ స్థాయికి చేరుకుంటుందో ఊహించడమే కష్టంగా ఉందని కొల్లు రవీంద్ర అన్నారు.

# విజయవాడ రైల్వే డివిజనల్ మేనేజర్‌కు నారా లోకేష్ లేఖ

విజయవాడ: తెలుగుదేశం పార్టీ జాతీయ ప్రధాన కార్యదర్శి నారా లోకేష్ విజయవాడ రైల్వే డివిజనల్ మేనేజర్‌కు లేఖ రాశారు. గుంటూరు జిల్లా, తాడేపల్లి మున్సిపాలిటీలోని 6, 14, 15, 16 వార్డుల పరిధిలోని రైల్వే భూముల్లో సుమారుగా 650 కుటుంబాలు కొన్నేళ్లుగా నివసిస్తున్నాయన్నారు. సుమారు 40 ఏళ్లుగా అక్కడే ఉంటున్న ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీలైన వీరందరికీ పనికెళ్తే కానీ పూట గడవని దయనీయస్థితిలో జీవిస్తున్నారన్నారు. ఉన్నట్టుండి ఇప్పుడు రైల్వే అధికారులు జనవరి 22 లోపు ఇళ్లు ఖాళీ చెయ్యాలని నోటీసులు ఇవ్వడంతో అక్కడ నివసిస్తున్న పేద ప్రజల్లో తీవ్ర ఆందోళన నెలకొందన్నారు. కోవిడ్ కారణంగా పనులు లేక పూట గడవటమే ఇబ్బందిగా మారిన వాళ్ళకి రైల్వే నోటీసులతో నిలువ నీడ కూడా లేకుండా పోతోందనే ఆవేదనలో ఉన్నారన్నారు. వారికి వీలైనంత త్వరగా ప్రభుత్వం స్థలం కేటాయించి పక్కా ఇళ్లు నిర్మించాలని అన్ని రాజకీయ పార్టీలు డిమాండ్ చేస్తున్నాయన్నారు. రాష్ట్ర ప్రభుత్వం వారికి స్థలం కేటాయించి పక్కా ఇళ్లు నిర్మించే వరకూ తాడేపల్లి రైల్వే స్థలంలో నివాసితులకు మానవతా దృక్పథంతో అక్కడ ఉండే అవకాశం ఇవ్వాలని లోకేష్ ఆ లేఖలో కోరారు.

# సంపాదకీయం

శనివారం 22 జనవరి 2022

## ఎల్ ఐసీ ఊపిరి తీసేస్తారా

లైఫ్ ఇన్సూరెన్స్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా (ఎల్ఐసి)లో విదేశీ ప్రత్యక్ష పెట్టుబడి (ఎఫ్‌డిఐ)లకు ప్రభుత్వం అనుమతులు ఇవ్వజూపుతుంది. ఇదే జరిగితే, సంస్థ తొలి పబ్లిక్ ఆఫర్ (ఐపిఒ) లో విదేశీ పెట్టుబడిదారులు కూడా పాల్గొనే వీలు కలుగుతుంది. ఎల్ఐసిలో ఎఫ్‌డిఐ అనుమతికి సంబంధించిన ప్రతిపాదనపై ఆర్థిక సేవల విభాగం, పెట్టుబడులు, ప్రభుత్వ ఆస్తుల నిర్వహణ విభాగం (దీపవ్?) గతంలో చర్చలు కూడా జరిపాయి. ఎల్ఐసిలో ఎక్కువ వాటాను ఒకటే విదేశీ పెట్టుబడి సంస్థ కొనుగోలు చేసేలా వీలు కల్పించడమే ఈ చర్చల సారాంశం.ఇప్పటికే దేశీయ బీమా రంగంలో 74 శాతం వరకు ఎఫ్‌డిఐకి నేరుగా అనుమతి ఉంది. కానీ ఈ నిబంధన ఎల్ఐసికి వర్తించదు. ఎందుకంటే ప్రజల చిన్న మొత్తాల పొదుపును ప్రీమియంల రూపంలో సమీకరించి, తద్వారా దేశ సర్వతోముఖాభివద్ధికి తోడ్పడే లక్ష్యంతో ఎల్ఐసిని పార్లమెంటు చట్టం ద్వారా 1956లో ఏర్పరిచారు కాబట్టి. అలాంటి ఎల్ఐసిలోకి ఎఫ్‌డిఐలను అనుమతిస్తే అతి పెద్ద విదేశీ పెన్షన్ ఫండ్‌లు, బీమా సంస్థలు దేశంలోనే అతి పెద్ద ఐపిఒగా భావిస్తున్న ఎల్ఐసి పబ్లిక్ ఇష్యూలో పాల్గొనే వీలుంటుంది.ఇది దేశ ప్రజలకు ప్రమాదకరమైనప్పటికీ బీమా రంగ ప్రభుత్వ దిగ్గజం ఎల్ఐసిలో వాటాలను విక్రయించడానికే వాణిజ్యం, పరిశ్రమల శాఖ ప్రత్యక్ష విదేశీ పెట్టుబడులు (ఎఫ్‌డిఐ) విధానాల సవరణకు నడుం బిగించింది. బీమా రంగానికి చెందిన ప్రస్తుత విధానాలు ఎల్ఐసి డిజిన్వెస్ట్‌మెంట్‌కు అనుమతించవని, దీంతో మార్గదర్శకాలను సవరించాల్సిందేనని, వెరసి ఎఫ్‌డిఐ విధానాలు మరింత సరళీకరించి వీలైనంత త్వరగా సవరించిన విధానాలను ప్రకటిస్తామని పరిశ్రమలు, అంతర్గత వాణిజ్య ప్రోత్సాహక శాఖ (డిపిఐఐటి) కార్యదర్శి అనురాగ్ జైన్ ప్రకటించారు.ఎల్ఐసి ప్రత్యేక చట్టంలో విదేశీ పెట్టుబడులకు అవకాశం లేదు కాబట్టే ఐపిఒను పూర్తి చేసి దాని ద్వారా నిధుల సేకరణతో ఎల్ఐసిలో వాటాలు ఉపసంహరించుకోవాలనేదే కేంద్రం ఎత్తుగడ. అందుకోసమే ఎల్ఐసి చట్టానికి సవరణలు తీసుకొచ్చే ప్రక్రియను మొదలు పెడుతున్నాయి. ప్రస్తుతం ఎల్ఐసి చట్టం ప్రకారం దేశీయ ఇన్వెస్టర్లు మాత్రమే ఆ సంస్థలో వాటాల కొనుగోలుకు నిబంధనలు పర్మిట్ చేస్తున్నాయి. బీమా రంగంలో 74 శాతం విదేశీ ప్రత్యక్ష పెట్టుబడులు (ఎఫ్‌డిఐ)లకు అనుమతులు ఉన్నా ఎల్ఐసికి ఈ నిబంధనలు వర్తించవు గాబట్టి ఇన్వెస్టర్లను అనుమతించడానికే ఎల్ఐసి చట్టానికి సవరణలు తీసుకొస్తున్నారు. ఇలా ఎల్ఐసి చట్టాన్ని సరళతరం చేస్తే విదేశీ ఇన్వెస్టర్లు పెట్టుబడులు పెట్టొచ్చు. ప్రస్తుతం ఉన్న ఎఫ్‌డిఐ పాలసీ ప్రకారం దేశీయ బీమా రంగంలో నేరుగా 74 శాతం విదేశీ పెట్టుబడులను అనుమతిస్తారు.అయితే ప్రత్యేక చట్టం కింద ఎల్ఐసి ఉన్నందున ఈ నిబంధనలు దానికి వర్తించవు. ఈ నేపథ్యంలోనే దేశ చరిత్రలోనే అతి పెద్దది కానున్న ఎల్ఐసి ఐపిఒ ప్రక్రియపై కేంద్ర ప్రభుత్వ శాఖలు చురుగ్గా చర్యలు చేపట్టి జయప్రదంగా ఎల్ఐసి ఐపిఒ ముగియడానికి అవసరమైన చర్యలు తీసుకుంటున్నాయి. కేంద్ర ప్రభుత్వం ఇప్పటికే ఎల్ఐసిని లిస్టింగ్ చేసే ప్రక్రియలో భాగంగా ఆర్థిక మంత్రిత్వ శాఖకు అనుబంధంగా ఉన్న దీపంకు సలహాదారులుగా డెలాయిట్ కంపెనీ, ఎస్‌బిఐ కాప్స్ కంపెనీలను నియమించింది. ఎల్ఐసి నిజ విలువ మదింపు చేయడానికంటూ మిల్లిమాన్ కంపెనీని కూడా నియమించింది. అంతిమంగా ఎల్ఐసిలో వాటాలు అమ్మి ఆర్థిక లోటును పూడ్చుకునే ఉద్దేశంతో కేంద్ర ప్రభుత్వం ఉందని స్పష్టంగా తెలుస్తోంది. అయితే ఇక్కడ మనం ఆలోచించాల్సిన విషయమేమంటే మన దేశ బీమా రంగంలో ఎఫ్‌డిఐ పరిమితిని పెంచాల్సిన అవసరం ఏమాత్రం లేదు. ఎందుకంటే ఐఆర్‌డిఎ చట్టం-1999 ద్వారా బీమా రంగంలో 26 శాతం విదేశీ ఈక్విటీని అనుమతించారు. తదనంతరం ఎఫ్‌డిఐ పరిమితిని 2015 సంవత్సరంలో 26 శాతం నుంచి 49 శాతానికి పెంచారు. ఇప్పుడు ఈ పరిమితిని 49 నుండి 74 శాతానికి పెంచి బీమా సంస్థలలో కూడా విదేశీ యాజమాన్యాన్ని అనుమతించాలనేదే కేంద్ర ప్రభుత్వ నాటకం.మన దేశ బీమా రంగంలోకి ప్రవేశించిన పెద్ద కార్పొరేట్ సంస్థలు తమ వ్యాపార ప్రయోజనాల విస్తరణ కోసం దేశం వెలుపల భారీగా పెట్టుబడులు పెడుతున్నాయి. కొన్ని కార్పొరేట్ బీమా సంస్థలు ఇప్పటికే స్టాక్ మార్కెట్లలో లిస్ట్ అయ్యి, మార్కెట్ల ద్వారా మూలధనాన్ని సమీకరించే స్థితిలోనే ఉన్నాయి. కనుక దేశీయ బీమా రంగంలో విదేశీ పెట్టుబడుల అవసరమే లేదు. ఒకవేళ బీమా రంగంలోకి విదేశీ పెట్టుబడులను ఎక్కువగా అనుమతిస్తే అవి దేశీయ పొదుపుపై పట్టు, నియంత్రణ సాధిస్తాయి. గతంలో ప్రపంచ వ్యాప్త అనుభవాలను బట్టి చూస్తే విదేశీ పెట్టుబడులు, దేశీయ పొదుపుకు ఏమాత్రం ప్రత్యామ్నాయం కాదని నిరూపితమైంది. ఇప్పటికే 49 శాతం పరిమితితో ఉండాల్సిన విదేశీ పెట్టుబడులు జీవిత బీమాలో 35.36 శాతం, సాధారణ బీమాలో 23.66 శాతంగా మాత్రమే ఉన్నాయి.అందువల్ల బీమా పరిశ్రమలో విదేశీ పెట్టుబడులను 49 శాతం నుంచి 74 శాతానికి పెంచడానికి ఎటువంటి హేతుబద్ధత లేదు. గత ఇరవై సంవత్సరాల కాలంలో ఇప్పటి దాకా ఎఫ్‌డిఐ ల ద్వారా దేశ బీమా రంగంలోకి వచ్చిన రూ. 10 వేల కోట్ల పెట్టుబడులలో అధిక భాగం స్టాక్ మార్కెట్లో పెట్టుబడి పెట్టడానికే ఉపయోగించారు తప్ప దేశంలో మౌలిక వసతుల కల్పన కోసం ఏ మాత్రమూ ఉపయోగపడలేదు. ఇప్పటి వరకూ లిస్టింగ్ అయిన ప్రైవేటు బీమా కంపెనీల బ్యాలెన్స్ షీట్లు చూస్తే, దేశ నిర్మాణం, మౌలిక వనరుల ప్రయోజనాల కోసం అవి పెట్టిన పెట్టుబడులు నామమాత్రమే అని అర్థం అవుతుంది. కాబట్టి బీమా రంగంలో ఎఫ్‌డిఐలను పెంచడం, విదేశీ యాజమాన్యాన్ని అనుమతించడం లాంటి నిర్ణయాలన్నీ భారతదేశంలోని ప్రజల విలువైన పొదుపును విదేశీ శక్తుల చేతికి అప్పగించడమే అవుతుంది. ఇక్కడ మరో ప్రమాదకరమేంటంటే ఎల్ఐసిలో వాటాల అమ్మకం పేరుతో ప్రభుత్వ పెట్టుబడుల్ని ఉపసంహరించడమంటే అది ప్రైవేటీకరణ దిశగా వేస్తున్న తొలి అడుగే.ప్రజల సొమ్ము ప్రజల సంక్షేమానికే అనే లక్ష్యంతో నాటి నుండి నేటి వరకు విజయవంతంగా ప్రజలకు విశిష్ట సేవలందిస్తున్న ఎల్ఐసి ఒక పారదర్శక సంస్థ. ఇది ప్రతి నెలా రెగ్యులేటర్ ఐఆర్‌డిఎ కి తన పని తీరు నివేదికలను సమర్పించి పార్లమెంట్ పరిశీలనకు తన జమ, ఖర్చులు, ఎకౌంట్ పుస్తకాలను పెడుతుంది. మరి ఇంత పారదర్శకంగా ఈ సంస్థ పని చేస్తున్నప్పుడు ఇంకేం పారదర్శకత కావాలి? భారత ఆర్థిక వ్యవస్థలో ప్రతి సంవత్సరం రూ. 3.5 లక్షల కోట్ల నుంచి రూ.4 లక్షల కోట్లు వరకు నిధులను పెట్టుబడులుగా పెట్టగల ఎల్ఐసి సంస్థకు నిధుల కోసం మార్కెట్‌ను ఆశ్రయించాల్సిన పరిస్థితి లేదు.

# పీఏల మధ్య రచ్చ మామూలుగా లేదే

శ్రీకాకుళం, జనవరి 21, (న్యూస్ పల్స్)రెడ్డి శాంతి. శ్రీకాకుళం జిల్లా పాతపట్నం ఎమ్మెల్యే. ఆమె తాత సాయిబాబు నాయుడు, తండ్రి రాజశేఖర్, తల్లి రుక్మిణమ్మ ఎమ్మెల్యేలుగా పనిచేశారు. మరెన్నో ఉన్నత పదవుల అనుభవించిన కుటుంబం నుంచి వచ్చినా.. ఆ స్థాయి రాజకీయం రెడ్డి శాంతికి వంటబట్టలేదని చెవులు కొరుక్కుంటున్నారు. ప్రస్తుతం పీఏల అత్యుత్సాహం వల్ల నియోజకవర్గంలో ఎమ్మెల్యే గ్రాఫ్ పడిపోయిందనేది అధికారపార్టీ వర్గాల వాదన.ప్రస్తుతం వైసీపీ రాష్ట్రంలో అధికారంలో ఉంది. రెడ్డి శాంతి కూడా వైసీపీ ఎమ్మెల్యేనే. ఇటీవల జరిగిన పంచాయతీ, పరిషత్, మున్సిపల్ ఎన్నికల్లో అధికారపార్టీ తిరుగులేని ఆధిపత్యం కనబర్చింది. ఇంతటి హవాలోనూ పాత్నపటంలో వైసీపీ ఎదురుగాలి వీచింది. కుమారుడు శ్రవణ్‌ను హిరమండలం జడ్పీటీసీగా బరిలో దింపి గెలిపించుకోలేకపోయారు రెడ్డి శాంతి. దీంతో నియోజకవర్గంపై ఎమ్మెల్యే పట్టు సడలిందనే ప్రచారం ఊపందుకుంది.పాతపట్నం నియోజకవర్గంలో ఐదు మండలాలు ఉంటే ఎల్ఎల్ పేట, పాతపట్నం మినహా మిగిలిన మూడు చోట్ల ఎమ్మెల్యే సూచించిన వాళ్లు కాకుండా వ్యతిరేకవర్గం పైచెయ్యి సాధించింది. హిరమండలం, కొత్తూరు, మెళియాపుట్టి మండలాల్లో ఎంపిపిలు ఎమ్మెల్యే రెడ్డి శాంతి ప్రమేయం లేకుండానే ఎన్నికయ్యారు. జిల్లాలో 38 జడ్పీటీసీలు ఉంటే 37 చోట్ల వైసీపీ గెలిచింది. ఓడిన ఆ ఒక్క జడ్పీటీసీ రెడ్డి శాంతి తనయుడి సీటే.వంశధార నిర్వాసితుల సమస్య ప్రతికూల పవనాలకు ఒక కారణమైతే.. రెడ్డి శాంతి పీఏలుగా ఉన్న వినయ్, రాంబాబుల వైఖరి కూడా ఈ పరిస్థితికి

కారణంగా లోకల్ వైసీపీ వర్గాలు చెబుతున్నాయి. అసెంబ్లీ ఎన్నికల్లో రెడ్డి శాంతి విజయానికి కృషి చేసిన సొంత సామాజికవర్గం నేతలు సైతం ఎమ్మెల్యేకు దూరం అవుతున్నారట. అలాగే స్థానిక సంస్థల ప్రజాప్రతినిధులు ఎమ్మెల్యేను కలిసి మాట్లాడే పరిస్థితులు లేవట. ఇక సీనియర్ నాయకులు నో ఎంట్రీ. ఎమ్మెల్యేలతో మాట్లాడే సమయంలో పీఏలు కూడా ఉండాలని చెబుతుండటంతో.. చాలా మంది మాట్లాడటానికి వెనకడుగు వేస్తున్నారట. దీంతో పీఏల కారణంగా పార్టీ నేతలతో రెడ్డి శాంతికి గ్యాప్ వచ్చినట్టు సమాచారం. మరి.. పాతపట్నం పరిస్థితులను చక్కదిద్దేందుకు వైసీపీ పెద్దలు ఫోకస్ పెడతారో లేదో చూడాలి.

# కామ్.. అయిపోయిన కావూరి



ఏలూరు, జనవరి 21, (న్యూస్ పల్స్)నాలుగు దశాబ్దాలకు పైగా రాజకీయ చరిత్ర సొంతం చేసుకున్న నాయకుడు కావూరి సాంబశివరావు. వినయశీలి, విద్యావంతుడు, మృదు స్వభావి, ఆలోచనా తత్పరుడుగా పేరు తెచ్చుకున్న నేతగా కూడా ఆయన గుర్తింపు పొందారు. ముఖ్యంగా కాంగ్రెస్‌లో ఆయనకు ప్రత్యేక గుర్తింపు ఉంది. ఎంపీగా ఆయన మచిలీపట్నం నుంచి గెలిచి రికార్డు సృష్టించారు. 1989లో ఆంధ్రాలో కాంగ్రెస్ తుడిచి పెట్టుకుపోతే ఆయన ఎంపీగా కావూరి సాంబశివరావు గెలిచారు. ఆ తర్వాత 2004, 2009 ఎన్నికల్లో జిల్లా మారి కూడా ఆయన ఏలూరు పార్లమెంటు స్థానం నుంచి పోటీ చేసి విజయం సాధించారు. అంతేకాదు, కాంగ్రెస్‌లో తనకంటూ.. ప్రత్యేకతను సంతరించుకున్నారు.వైఎస్ రాజశేఖరరెడ్డి మరణానంతరం కేంద్రంలోని కాంగ్రెస్ నేతలతో తనకున్న సంబంధాలకు మరింతగా పదును పెట్టి చివర్లో ఓ రేంజ్‌లో హవా చెలాయించారు. ఈ క్రమంలోనే తన చిరకాల కోరిక అయిన కేంద్ర మంత్రి పదవిని కూడా కావూరి సాంబశివరావు సొంతం చేసుకున్నారు. అదే సమయంలో తన అనుచరులకు కూడా పదవులు ఇప్పించుకున్నారు. అలాంటి నాయకుడు రాష్ట్ర విభజన ఎఫెక్ట్‌తో కాంగ్రెస్‌కు దూరమయ్యారు. నిజానికి సమైక్య రాష్ట్ర కోసం గళం విప్పిన నాయకుల్లో కావూరి సాంబశివరావుకూడా ఒకరు. అయితే.. ఏపీ నేతల మాటలకు కాంగ్రెస్ విలువ ఇవ్వకపోవడంతో కావూరి పార్టీకి దూరంగా వచ్చారు. ఈ క్రమంలోనే ఆయన బీజేపీలోకి చేరిపోయారు. 2014లో కేంద్రంలో బీజేపీ అధికారంలోకి రావడంతో ఏదైనా పదవి లభించకపోతుందా ? అని కావూరి సాంబశివరావు భావించారు. ముఖ్యంగా ఆయన రాజ్యసభకు వెళ్లాలని భావించారు. అయితే.. కావూరి సాంబశివరావు సామాజిక వర్గం నేతల లాబీయింగ్ ఎక్కువగా ఉండడం, కేంద్ర బీజేపీ నేతలు ఏపీపై పెద్దగా దృష్టి పెట్టకపోవడం వంటి కారణాల నేపథ్యంలో కావూరి ఆశలు ఫలించలేదు. దీంతో ఆయన మౌనంగా ఉంటున్నారు. అసలు ఆయన బీజేపీలో ఉన్నారా ? అన్న సందేహాలు కూడా ఉన్నాయి. వాస్తవానికి 2019 ఎన్నికల్లో వైసీపీ నుంచి కావూరి సాంబశివరావుకి ఆహ్వానం అందింది. అయితే.. అప్పటికే ఎన్నికలకు రంగం సిద్ధం కావడంతో కావూరి సాంబశివరావు సునిశితంగా తిరస్కరించారు.ఇప్పుడు కావూరి సాంబశివరావు బీజేపీలో ఉన్నా.. మౌనంగా ఉంటున్నారే తప్ప.. ఎక్కడా స్పందన ఉండడం లేదు. వయసు రీత్యా కూడా ఆయన అనారోగ్యంతో ఉన్నారనే ప్రచారం ఇటీవల వచ్చింది. తన రాజకీయ వారసురాలిగా ఒక కుమార్తెను తీసుకురావాలని ప్రయత్నించినా.. సాధ్యం కాకపోవడంతో కావూరి కుటుంబం నుంచి రాజకీయంగా ఎవరూ వెలుగు చూడలేక పోయారు. కావూరి సాంబశివరావు వారసత్వాన్ని అందిపుచ్చుకోలేక పోయారు. ఫలితంగా నాలుగు దశాబ్దాలపాటు రాష్ట్రంలోను, కేంద్రంలోను రాజకీయ చక్రంతిప్పిన కావూరి.. పాలిటిక్స్‌కు శుభం కార్డు పడినట్టేనని అంటున్నారు ఆయన అభిమానులు.

# మరో ఎన్నికలకు అంతా సిద్ధం

విజయవాడ, జనవరి 21, (న్యూస్ పల్స్)గతంలో ఎన్నికలు జరగని 22 నగరపాలక సంస్థలు, మునిసిపాలిటీలు, నగర పంచాయతీల్లో ఈవీఎంల విధానంలో ఎన్నికలు నిర్వహించేందుకు రాష్ట్ర ఎన్నికల కమిషన్ కసరత్తు చేస్తోంది. రాష్ట్రవ్యాప్తంగా 17 నగరపాలక సంస్థలు, 106 మునిసిపాలిటీలు, నగర పంచాయతీలున్నాయి. తెలుగుదేశం ప్రభుత్వంలో కాకినాడ కార్పొరేషన్ ఎన్నికలు జరిగాయి. వైఎస్సార్‌సీపీ అధికా రంలోకి వచ్చిన తరువాత గత ఏడాది మార్చిలో 12 నగరపాలక సంస్థలు, 75 పురపాలక సంఘాలకు, నవంబర్‌లో నెల్లూరు నగరపాలక సంస్థకు, 12 పుర పాలక సంఘాలు, నగర పంచాయతీలకు ఎన్నికలు నిర్వహించింది.ఈ రెండు విడతల్లోను బ్యాలెట్ విధానంలోనే ఎన్నికలు జరిగాయి. కోర్టు కేసుల కా రణంగా రాజమహేంద్రవరం (రాజమండ్రి), శ్రీకా కుళం, మంగళగిరి?తాడేపల్లి నగరపాలక సంస్థల్లో ను, ఆముదాలవలస, రాజాం (శ్రీకాకుళం జిల్లా), తణుకు, పాలకొల్లు, భీమవరం, తాడేపల్లిగూడెం, చింతలపూడి (పశ్చిమగోదావరి), వైఎస్సార్ తాడి గడప, గుడివాడ (కృష్ణా), బాపట్ల, పొన్నూరు, నర సరావుపేట (గుంటూరు), కందుకూరు, పొదిలి (ప్రకాశం), కావలి, గూడూరు, అల్లూరు (నెల్లూరు), బి.కొత్తకోట, శ్రీకాళహస్తి (చిత్తూరు జిల్లా) పురపాలక సంఘాలు, నగర పంచాయతీల్లో ఎన్నికలు జరగలేదు. కోర్టు కేసులు కొలిక్కి వస్తే వీలైనంత త్వరగా వీటికి ఎన్నికలు నిర్వహించాలని రాష్ట్ర ఎన్నికల కమిషన్ సన్నాహాలు చేస్తోంది.రాష్ట్ర ఎన్నికల కమిషనర్ నీలం సాహ్ని వారం రోజుల కిందట తన కార్యాలయ అధికారులతో సమావేశం నిర్వహించి ఈవీఎంల విధానంలో ఎన్నికల నిర్వహణ సాధ్యాసాధ్యాలపై చర్చించారు. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో మునిసిపల్ ఎన్నికలు ఈవీఎంల విధానంలో నిర్వహించిన విషయాన్ని అధికారులు రాష్ట్ర ఎన్నికల కమిషనర్ దృష్టికి తీసుకొచ్చారు. దాదాపు 8 వేల ఈవీఎంలు అందుబాటులో ఉన్నట్టు తెలిపారు. 22 నగరపాలక సంస్థలు, పురపాలక సంఘాలు, నగర పంచాయతీలకు ఒకేసారి ఎన్నికలు నిర్వహించాల్సి వచ్చినా నాలుగువేల బూత్‌లలోనే పోలింగ్ ఉంటుందని, ఇందుకు ఆ ఈవీఎంలు సరిపోతాయని వివరించారుఅసెంబ్లీ, లోకసభ ఎన్నికలను ఈవీఎంలతో పాటు వీవీప్యాట్‌లతో కలిపి ఉండే మిషన్లతో నిర్వహిస్తున్నారని, రాష్ట్ర ఎన్నికల కమిషన్ వద్ద వీవీప్యాట్‌లు లేని పాత ఈవీఎంలు మాత్రమే ఉన్నాయని తెలిపారు. ఈ నేపథ్యంలో ఆయా ఈవీఎంలకు వీవీప్యాట్‌లను అనుసంధానం చేసే అంశంపై ప్రభుత్వరంగ సంస్థ ఈసీఐఎల్‌ను సంప్రదించి తదుపరి చర్యలు చేపట్టాలని సమావేశంలో నిర్ణయించారు. కోర్టు కేసులపైనా దృష్టి ఎన్నికలు జరగని 22 నగరపాలక సంస్థలు, పురపాలక సంఘాలు, నగర పంచాయతీలకు సంబంధించిన పెండింగ్‌లో ఉన్న కోర్టు కేసులపై రాష్ట్ర ఎన్నికల కమిషన్ కార్యాలయ అధికారులు ఎప్పటికప్పుడు మునిసిపల్‌శాఖ అధికారులతో సంప్రదిస్తున్నారు. నెలరోజుల కిందట నీలం సాహ్ని మునిసిపల్‌శాఖ అకారులతో సమావేశమై ఆయా కేసుల పరిస్థితి గురించి తెలుసుకున్నారు.

# ఈ ఫార్మర్ మార్కెట్ ద్వారా...భారీ లావాదేవీలు

కర్నూలు, జనవరి 21, (న్యూస్ పల్స్()రైతులు తాము పండించిన పంటను కళ్లాల నుంచే నేరుగా నచ్చిన ధరకు అమ్ముకునే అవకాశాన్ని రాష్ట్ర ప్రభుత్వం ఈ ఫార్మార్కెట్ ద్వారా కల్పిస్తోంది. రైతులు, కొనుగోలుదారులు, వ్యాపారులు, ప్రాసెసర్‌లను అనుసంధానిస్తూ దేశంలో తొలిసారిగా రూపొందించిన ఎలక్ట్రానిక్ ట్రేడింగ్ పోర్టల్ ఇదే కావడం గమనార్హం. మండీలకు ప్రత్యామ్నాయంగా తెచ్చిన ఈ ప్లాట్‌ఫామ్ ద్వారా రైతులను రాష్ట్ర పరిధిలోనే కాకుండా జాతీయ, అంతర్జాతీయ ట్రేడర్స్‌తో అనుసంధానిస్తారు. నాణ్యమైన ఉత్పత్తులు, నిల్వ సామర్థ్యం, ఆర్థిక చేయూత లాంటి సేవలను ఒకే వేదిక కిందకు తీసుకు రావడం ద్వారా అవాంతరాలు లేని వాణిజ్యాన్ని సృష్టించాలన్న సంకల్పంతో ఈ ప్లాట్‌ఫామ్‌ను ప్రభుత్వం తెచ్చింది. వ్యవసాయ రంగంలో డిజిటల్ వ్యాపారాన్ని ప్రవేశపెట్టి మార్కెటింగ్ విలువను పెంచుతున్నారు. ఎన్ఎఫ్‌సీఎల్ ద్వారా అభివృద్ధి చేసిన ఎలక్ట్రానిక్ ప్లాట్‌ఫామ్ నిర్వహణ కోసం కంపెనీల చట్టం?2013 కింద ప్రత్యేకంగా 'ఏపీ ఫార్మర్స్ ఈ?విక్రయ కార్పొరేషన్ లిమిటెడ్' (ఏపీఎఫ్ఈవీసీఎల్) ఏర్పాటైంది. ఫామ్‌గేట్ వద్ద మౌలిక సదుపాయాలతో పాటు నిబంధనల ప్రకారం లావాదేవీల నిర్వహణ, రవాణా, చెల్లింపులు, వివాదాల పరిష్కారం కోసం ప్రత్యేకంగా స్పెషల్ పర్పస్ వెహికల్ (ఎస్‌పీవీ) ఏర్పాటు చేశారు. ఈ?ఫార్మార్కెటింగ్ మొబైల్ అప్లికేషన్ ద్వారా అనంతపురం, కర్నూలు, చిత్తూరు, వైఎస్సార్ కడప జిల్లాల్లో పైలెట్ ప్రాజెక్టుగా వ్యాపార లావాదేవీలు నిర్వహించారు. 108 మంది వ్యాపారులు, 254 మంది రైతులు రూ.4.04 కోట్ల విలువైన 294 వ్యాపార లావా దేవీలను దీనిద్వారా నిర్వహించారు. 2022?23లో 10,200 మంది వ్యాపారులు, 50 వేల మందికి పైగా రైతులను భాగస్వాములుగా చేయడం ద్వారా కనీసం రూ.1,000 కోట్ల వ్యాపార లావాదేవీలను ఈ?ఫార్మార్కెటింగ్ మొబైల్ అప్లికేషన్ ద్వారా నిర్వహించాలని లక్ష్యంగా నిర్దేశించారు. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి చేతుల మీదుగా త్వరలో ఈ ప్రతిష్టాత్మక ప్రాజెక్టును ప్రారంభించేందుకు ఏర్పాట్లు చేస్తున్నారు.కర్నూలు జిల్లా ఓర్వకల్లు మండలం గూటపాడు రైతు కరువా వెంకటేశ్వర్లు ఖరీఫ్‌లో 10 ఎకరాల్లో మొక్కజొన్న సాగు చేయగా ఎకరానికి 25 క్వింటాళ్లకు పైగా దిగుబడి వచ్చింది. ఈ ? మార్కెటింగ్ ప్లాట్‌ఫామ్ ద్వారా నంద్యాలకు చెందిన వ్యాపారి కృష్ణారెడ్డికి 125 క్వింటాళ్ల మొక్కజొన్నను క్వింటాల్ రూ.1,700 చొప్పున విక్రయించారు. వ్యాపారి నేరుగా కళ్లం వద్దకు వచ్చి కొనుగోలు చేశారు. తరుగు తీయకుండా రేటు కట్టారు. 24 గంటలు తిరక్కుండా నే వెంకటేశ్వర్లు ఖాతాకు డబ్బులు జమ అయ్యాయి.వ్యవసాయ క్షేత్రం నుంచే తమ ఉత్పత్తులను ఎలాంటి ఫెసిలిటేషన్ రుసుము, దళారీల ప్రమేయం లేకుండా నేరుగా విక్రయించవచ్చు. ఉత్పత్తి లభ్యత, పంట వివరాలను ముందుగానే పోర్టల్‌లో నమోదు చేసుకోవచ్చు. స్థానికంగానే కాకుండా జాతీయ, అంతర్జాతీయ కొనుగోలుదారుల వివరాలు పోర్టల్‌లో ఉన్నందున నేరుగా సంప్రదించవచ్చు. చెల్లింపులన్నీ ప్రభుత్వ పర్యవేక్షణలో జరగనుండడంతో మోసాలకు ఆస్కారముండదు. ఫామ్‌గేట్ స్థాయిలో మౌలిక సదుపాయాలతో పాటు జాతీయ, అంతర్జాతీయ మార్కెట్ల ధరలను ప్రదర్శించడం రైతుల్లో బేరసారాల శక్తి పెరుగుతుంది. ఆధార్‌తో అనుసంధానమైన బ్యాంకు ఖాతాలకు 24 గంటల్లోనే చెల్లింపులు చేస్తారు.ప్లాట్‌ఫామ్‌లో వివిధ రకాల ఉత్పత్తులు అందుబాటులో ఉన్నందున నాణ్యమైన వాటిని ఎంచుకోవచ్చు. తదనుగుణంగా వ్యాపార విస్తరణ ప్రణాళికలు రూపొందించుకోవచ్చు.రైతుల నుంచి కొనుగోలు చేసే పంట ఉత్పత్తులకు ప్రభుత్వమే సర్టిఫైడ్ క్వాలిటీ అసెస్‌మెంట్ చేస్తారు

# 'టీడీపీ గూటికి బుట్టా రేణుక ?



కర్నూలు, జనవరి 21, (న్యూస్ పల్స్)బుట్టా రేణుక రాజకీయాల్లోకి వచ్చిన వెంటనే అత్యున్నత సభ అయిన పార్లమెంటులో అడుగుపెట్టారు. రాజకీయంగా ఆమె వేసిన తప్పటడుగులు పదవులకు దూరం చేశాయి. అయితే మరోసారి బుట్టా రేణుక తన భవిష్యత్ ను నిర్ణయించుకునేందుకు రెడీ అయ్యారంటున్నారు. వైసీపీలో ఉంటే వచ్చే ఎన్నికలలో టిక్కెట్ రాదని బుట్టా రేణుక భావిస్తున్నారు. అందుకే మరోసారి టీడీపీకి దగ్గరయ్యే ప్రయత్నం చేస్తున్నారని తెలిసింది. తొలి నుంచి... బుట్టా రేణుక భర్త తొలి నుంచి టీడీపీ సానుభూతి పరుడు. ఆయనకు టీడీపీ అత్యున్నత స్థాయి నేతలతో సత్సంబంధాలున్నాయి. ఇప్పటికీ వాటిని కొనసాగిస్తున్నారు. 2014 లో జరిగిన ఎన్నికల్లో కర్నూలు పార్లమెంటు నుంచి పోటీ చేసిన బుట్టా రేణుక విజయం సాధించారు. వైసీపీ పార్లమెంటు సభ్యురాలిగా సభలో అడుగు పెట్టారు. అయితే వైసీపీ అప్పట్లో అధికారంలోకి రాకపోవడంతో ఆమె భర్త ముందుగానే టీడీపీలో చేరిపోయారు తర్వాత బుట్టా రేణుక కూడా టీడీపీ మద్దతుదారుగా మారిపోయారు. కానీ 2019 ఎన్నికల్లో టీడీపీ కోట్ల సూర్యప్రకాష్ రెడ్డికి టిక్కెట్ ఇవ్వడంతో బుట్టారేణుక ఎన్నికలకు ముందే వైసీపీలో చేరిపోయారు. కానీ వైసీపీలో ఆమెకు ఎలాంటి పదవులు దక్కలేదు. కనీసం ఎమ్మెల్సీ స్థానాన్ని అయినా ఇస్తారని బుట్టా రేణుక భావించారు. కానీ ఒకసారి చీట్ చేసి వెళ్లి వారికి జగన్ పదవులు ఇవ్వరని పార్టీ అగ్రనేత ఒకరు చెప్పడంతో బుట్టా రేణుక పునరాలోచనలో పడ్డారని చెబుతున్నారు.మొన్న స్థానిక సంస్థల ఎన్నికల వరకూ వైసీపీలో యాక్టివ్ గా ఉన్న బుట్టా రేణుక ఇటీవల సైలెంట్ అయ్యారు. మరోవైపు తెలుగుదేశం పార్టీలో అయితే ఎంపీగా కాని, లేదా ఎమ్మెల్యేగా గాని అవకాశం లభిస్తుందన్న అంచనాలో ఉన్నారు. కోట్ల సూర్యప్రకాశ్ రెడ్డికి ఈసారి ఎంపీ సీటును ఇచ్చేందుకు చంద్రబాబు సుముఖంగా లేరు. అలాగే ఎమ్మిగనూరు స్థానాన్ని కూడా మార్చాలనుకుంటున్నారు. ఈ నేపథ్యంలో రెండింటిలో ఒకటి తనకు దక్కుతుందన్న ఆశతో బుట్టా రేణుకు ఉన్నట్లు తెలుస్తోంది. ఆమె భర్త టీడీపీ నేతలతో మంతనాలు జరుపుతున్నారు. స్పష్టమైన హామీ లభిస్తే జంప్ చేయడానికి రేణుక రెడీగా ఉన్నారు.

# పొత్తుల లెక్కలు

విజయవాడ జనవరి 21, (న్యూస్ పల్స్)తెలుగుదేశం పార్టీ అధినేత చంద్రబాబు ఎవరితోనైనా జత కట్టగలడు. ఎవరితోనైనా విభేదించగలడు. సీబీఎన్ ట్రాక్ రికార్డు అది. ఒకసారి ఆ పార్టీతో కలిసి పోటీ చేస్తారు. మరోసారి విభేదిస్తారు. సిద్ధాంతాలు అంటూ ఏమీ ఉండవు. గెలుపు లెక్కతోనే చంద్రబాబు పొత్తులకు సిద్ధపడతారు. చంద్రబాబు పొత్తుల కోసం ఏ ప్రయత్నం చేసినా ఇప్పటి వరకూ ఫెయిల్ కాలేదు. అందుకే ఈసారి కూడా జనసేనతో పొత్తు ఖచ్చితంగా ఉంటుందన్న అంచనాలు అందరిలోనూ ఉన్నాయి. ఎవరితో ? 1999లో చంద్రబాబు బీజేపీతో కలసి పోటీ చేశారు. రెండోసారి ముఖ్యమంత్రి అయ్యారు. మళ్లీ అదే కాంబినేషన్ లో 2004లో ఎన్నికలకు వెళ్లినా గెలుపు దక్కలేదు. దీంతో బీజేపీని చంద్రబాబు పక్కన పెట్టేశారు. బీజేపీని మతతత్వ పార్టీగా చంద్రబాబు గత పొత్తులను మరిచిపోయి ధైర్యంగానే చెప్పగలిగారు. ఇక 2009లో చంద్రబాబు టీఆర్ఎస్, కమ్యునిస్టు పార్టీలతో పొత్తు పెట్టుకున్నారు. తెలంగాణ ఉద్యమ పార్టీతో కలసి పోటీ చేశారు. అయినా పెద్దగా వర్క్ అవుట్ కాలేదు. ఆ తర్వాత కేసీఆర్ ను విభేదించారు. 2014 ఎన్నికల్లో తాను తిట్టిన బీజేపీతోనే జతకట్టారు. బీజేపీని దగ్గరకు చేర్చుకోవడంలో సక్సెస్ అయ్యారు. తర్వాత హోదా కోసం దానిని పక్కన పెట్టారు. ఇక 2018 ఎన్నికల విషయానికి వస్తే చంద్రబాబు ట్రాక్ రికార్డులోనే రికార్డ్ బ్రేక్ చేశారని చెప్పాలి. తెలుగుదేశం పార్టీ కాంగ్రెస్ కు వ్యతిరేకంగా పుట్టిన పార్టీ. అలాంటి పార్టీని తీసుకెళ్లి కాంగ్రెస్ తో జతకట్టేలా చేశారు. తెలంగాణ ఎన్నికల్లో కాంగ్రెస్, సీపీఐ, తెలంగాణ జనసమితితో కలిపి మహాకూటమిని ఏర్పాటు చేశారు. రాహుల్ గాంధీతో కలసి సభల్లో పాల్గొన్నారు. ఏడాది తిరగక ముందే చంద్రబాబు అదే రాహుల్ గాంధీని వ్యతిరేకించారు. ఇక 2019 ఎన్నికల్లో పొత్తులతో ముందుకు వెళ్లాలన్నా అప్పటికే జనసేన కూటమిని ఏర్పాటు చేసుకుంది. దీంతో చంద్రబాబు పొత్తు ప్రయత్నాలు ఫలించలేదు. దీంతో పాటు అమరావతి, పోలవరం ప్రాజెక్టులు తనను మరోసారి ముఖ్యమంత్రిని చేస్తాయని భావించారు. అందుకే పొత్తుల కోసం గట్టిగా ప్రయత్నించలేదు. అందుకే చంద్రబాబు కూటములను కట్టడంలో దిట్ట. ఆయన ఎవరితో విభేదించినా, ప్రేమించినా స్వల్ప కాలమే. కాబట్టి చంద్రబాబు ప్రేమ పురాణం.. జనసేనతో పెళ్లి వరకూ దారితీస్తుందనడంలో ఎటువంటి సందేహం లేదు.

## రాజ్యసభ కోసం ఎదురు చూపులు

విజయనగరం, జనవరి 21, (న్యూస్ పల్స్)కిల్లి కృపారాణి పదవుల కోసం వెయిట్ చేస్తున్నారు. అయితే అదేమి చిత్రమో కాని ఆమె అనుకున్నప్పుడు ఎటువంటి పదవి దక్కడం లేదు. వైసీపీ అధికారంలోకి వచ్చి మూడేళ్లవుతుంది. మూడేళ్లవుతున్నా ఆమెకు ఎటువంటి పదవి దక్కకపోవడంతో ఇప్పుడు కొత్త చర్చ మొదలయింది. తొలుత ఎమ్మెల్సీ పదవి కిల్లి కృపారాణికి వస్తుందనుకున్నారు. కానీ అదే జిల్లాలో దువ్వాడ శ్రీనివాస్ వంటి వారికి లభించాయి. కిల్లి కృపారాణికి దక్కలేదు. ఇక కిల్లి కృపారాణికి రాజ్యసభ పదవి దక్కుతుందని భావించారు. వచ్చే మార్చిలో నాలుగు రాజ్యసభ స్థానాలు ఖాళీ అవుతున్నాయి. తాను గతంలో పార్లమెంటు సభ్యురాలిగా ఉండటంతో జగన్ తనకు రాజ్యసభ అవకాశమిస్తారని భావించారు. కానీ రానున్న కాలంలో ఖాళీ అయ్యే రాజ్యసభ స్థానాలకు ముందుగానే అభ్యర్థులు ఖరారయ్యారంటున్నారు. జగన్ కొందరికి నేరుగా హామీ ఇవ్వడం, సామాజిక సమీకరణాల నేపథ్యంలో రాజ్యసభ పదవుల ఎంపిక ఉండనుండటంతో ఈసారి కూడా కిల్లి కృపారాణికి పెద్దల సభలో చోటు దక్కడం కష్టంగానే ఉంది. ఈ నేపథ్యంలో కొత్తగా మరో టాక్ బలంగా వినపడుతుంది. 2024 ఎన్నికలలో కిల్లి కృపారాణిని శ్రీకాకుళం పార్లమెంటుకు పోటీ చేయించాలన్న ఆలోచనలో జగన్ ఉన్నారని తెలిసింది. అక్కడ బలమైన అభ్యర్థి కిల్లి అని జగన్ అంచనా వేస్తున్నారు.

## కలమల్లలో కార్డన్ అండ్ సెర్చ్

కడప జనవరి 21, (న్యూస్ పల్స్) కడప సబ్ డివిజన్, కలమల్ల పోలీస్ స్టేషన్ పరిధిలోని ఫ్యాక్షన్ ప్రభావిత మాలేపాడు గ్రామంలో కార్డన్ అండ్ సెర్చ్ ఆపరేషన్ జరిగింది. పోలీసులు గ్రామంలో అణువణువూ క్షుణ్ణంగా తనిఖీలు నిర్వహించారు. ఫ్యాక్షనిస్టులకు, వారి అనుచరులకు ఎర్రగుంట్ల రూరల్ సి.ఐ రవీంద్రనాథ్ రెడ్డి, అర్బన్ సి.ఐ మంజునాథ్ రెడ్డి కౌన్సిలింగ్ ఇచ్చారు. గ్రామం లో ప్రశాంత వాతావరణానికి భంగం కలిగిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో కలమల్ల ఎస్.ఐ చంద్రమోహన్, వి.ఎన్ పల్లి ఎస్.ఐ మధుసూదన్ రెడ్డి, ఎర్రగుంట్ల ఎస్.ఐ ప్రవీణ్ కుమార్, సిబ్బంది పాల్గొన్నారు.

## ఆదోని పట్టణంలో భారీ అగ్నిప్రమాదం

కర్నూలు జనవరి 21, (న్యూస్ పల్స్) కర్నూలు జిల్లా ఆదోని పట్టణంలో భారీ అగ్నిప్రమాదం జరిగింది. కంచిగారి వీధిలో అర్ధరాత్రి చాముండేశ్వరి స్టేషనరీ దుకాణంలో మంటలు చెలరేగాయి. స్థానికులు సమాచారం ద్వారా అగ్నిమాపక సిబ్బంది చేరుకొని మంటలను అదుపు చేశారు. సుమారు 10 లక్షల వరకు ఆస్తి నష్టం జరిగినట్టు బాధితులు దుకాణ యజమాని ప్రజాపథ్ అంబలాల్ తెలిపారు.

## తిరుమలలో సినీ ప్రముఖులు

తిరుమల జనవరి 21, (న్యూస్ పల్స్) తిరుమలలో సినీ ప్రముఖులు సందడి చేశారు. శుక్రవారం ఉదయం స్వామి వారి నైవేద్య విరామ సమయంలో సినీ నటుడు అక్కినేని నాగార్జున,ఆయన సతీమణి అక్కినేని అమల స్వామి వారి సేవలో పాల్గొని మొక్కులు చెల్లించుకున్నారు.. ఆలయ అధికారులు స్వాగతం పలికి దర్శన ఏర్పాట్లు చేశారు.. అనంతరం రంగనాయకుల మండపంలో వీరికి వేద పండితులు వేద ఆశీర్వాదం అందించగా.. ఆలయ అధికారులు పట్టు వస్త్రంతో సత్కరించి స్వామి వారి తీర్ధ ప్రసాదాలు.. అనంతరం ఆలయ వెలుపలకు వచ్చిన సినీనటుడు అక్కినేని నాగార్జున మీడియాతో మాట్లాడుతూ.. కోవిడ్ కారణంగా రెండు సంవత్సరాలు స్వామి వారిని దర్శించుకో లేక పోయాంమని, ఇవాళ స్వామి వారి ఆశీస్సులు పొందాంమని, అలాగే ఈ ఏడాది ప్రపంచ ప్రజలందరికి అందరికి మంచి జరగాలని ప్రార్ధించినట్లు అక్కినేని నాగార్జున చెప్పారు..



## దళితులపై వివక్షత చూపుతున్న వారిని తక్షణం అరెస్టు చేయాలి కెవిపిఎస్

నందవరం మండలం పరిధిలో తాసిల్దార్ కార్యాలయం నందు కోడుమూరు అనుగొండ గ్రామం లో లో దళితులప వివక్షతను ఖండిస్తూ నిరసన చేసి అనంతరం తహసీల్దార్ కి వినతి పత్రం ఇవ్వడం జరిగింది. ఈ కార్యక్రమాన్ని ఉద్దేశించి కెవిపిఎస్ మండల అధ్యక్షులు రాజు ఎస్ఎఫ్ఐ జిల్లా సహాయ కార్యదర్శి రంగప్ప మాట్లాడుతూ స్వతంత్ర భారతదేశంలో రాజ్యాంగం అమల్లోకి వచ్చి 75 సంవత్సరాలు అవుతున్నప్పటికీ ఇంకా దళితులపై రోజు రోజుకు వివక్ష చూపడం చాలా దారుణమని వివక్షత చూపిస్తున్న వారిపై ఎస్సీ ఎస్టీ అట్రాసిటీ కేసులు పెట్టి తక్షణమే అరెస్టులు చేయాలని డిమాండ్ చేశారు అలాగే అనుగొండ గ్రామంలో దళితులు కటింగ్ షాపులకు వెళ్తే అగ్రవర్ణ కులలకు చెందిన కొందరు మీరు దళితులు ఇక్కడ కటింగ్ చేయించుకో కూడదని చెప్పి మెడ పట్టుకుని బయటకు నుకాడం అలాగే మహనీయుల చిత్రపటాలను చింపి బస్టాండ్ మైల్ పడిందంటూ నీళ్లతో కడిగిన వారిని తక్షణం అరెస్టు చేయాలని, దళితులపై ఆర్థిక బహిష్కరణ చేసిన వారిపై చర్యలు తీసుకోవాలని, గ్రామంలో ఉన్న దళితులకు ఉపాధి హామీ పనులు మొదలు పెట్టాలని, పెద్దగొనేహల్ గ్రామంలో దళితుల ఇళ్లపై దాడులు చేసి నివాసాలు నాశనం చేసినట్లు వంటివి ప్రధాన ముద్దాయిలను అరెస్టు చేయాలని, గ్రామంలోని దళితులకు నష్ట పరిహారం ఇచ్చి మరల ఇల్లు పునర్నిర్మించి ఇవ్వాలని ఘటన ప్రాంతానికి జిల్లా కలెక్టర్ మరియు జిల్లా ఎస్పీ వచ్చే సమస్యలు పరిష్కరించాలని డిమాండ్ చేశారు ఈ కార్యక్రమంలో కెవిపిఎస్ నాయకులు నాగప్ప, డేవిడ్, షెడ్రక్ ,దేవరాజు, ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

## సమతామూర్తి విగ్రహా ఆవిష్కరణకు రండి

విజయవాడ, జనవరి 21, (న్యూస్ పల్స్)తెలుగు నేల పులకించేలా విశ్వనగరం హైదరాబాద్ సిగలో రూపుదిద్దుకున్న సమతామూర్తి విగ్రహ ప్రతిష్ఠాపనా మహోత్సవాలకు హాజరుకావాలని ఆంధ్రప్రదేశ్ గవర్నర్ మాననీయ బిశ్వభూషణ్ హరిచందన్ కు ఆహ్వానం పలికారు. త్రిదండి చిన జీయర్ స్వామి సత్ సంకల్పం ఫలితంగా సాకారమయ్యే ఈ మహోత్సవ ఘట్టానికి విచ్చేయాలని శాసన పరిషత్తు సభ్యుడు తలశిల రఘురాం, చంద్రగిరి శాసన సభ్యుడు చెవిరెడ్డి భాస్కర రెడ్డి తదితర భక్త బృందం సభ్యులు గౌరవ గవర్నర్ ను స్వాగతించారు. శుక్రవారం విజయవాడ రాజ్ భవన్ లో గవర్నర్ ను కలిసిన వీరు, ఫిబ్రవరి 2 నుంచి 14 వరకు ఈ బృహత్కార్యం జరగనుందని వివరించారు.సమత, మమత, ఆధ్యాత్మికతల మేళవింపుగా విశ్వమానవాళి శ్రేయస్సు ఆకాంక్షిస్తూ ఈ కార్యక్రమం చేపట్టారని చెవిరెడ్డి గవర్నర్ కు వివరించారు. 200 ఎకరాల సువిశాల స్థలంలో 216 అడుగుల భగవద్రామానుజ పంచలోహ మహా విగ్రహం రూపుదిద్దుకుందన్నారు. విగ్రహ ప్రారంభోత్సవం సందర్భంగా సహస్రకుండాత్మక లక్ష్మీ నారాయణ యాగం నిర్వహిస్తున్నారని, 1035 హోమగుండాలతో ప్రత్యేక యాగం చేస్తారని చెవిరెడ్డి గవర్నర్ దృష్టికి తీసుకు వచ్చారు. మరోవైపు చిన జియ్యర్ స్వామి చరవాణిలో గవర్నర్ తో ప్రత్యేకంగా మాట్లాడారు. కరోనా వ్యాప్తి నేపధ్యంలో స్వయంగా వచ్చి ఆహ్వానించ లేకపోతున్నానని, తప్పని సరిగా కార్యక్రమానికి రావాలని గవర్నర్ బిశ్వభూషన్ హరిచందన్ కు విన్నవించారు. ఈ కార్యక్రమంలో గవర్నర్ వారి ప్రత్యేక ప్రధాన కార్యదర్శి ఆర్ పి సిసోడియా తదితరులు పాల్గొన్నారు.

## తిరుచానూరులో వేడుకగా ప్రారంభమైన నవకుండాత్మక శ్రీయాగం

**50 సంవత్సరాల తరువాత టీటీడీ ఛైర్మన్ శ్రీ వైవి సుబ్బారెడ్డి దంపతుల చే నిర్వహణ**

**అమ్మవారికి 34 గ్రాముల బంగారు హారం బహూకరించిన ఛైర్మన్ కుటుంబం**

తిరుపతి జనవరి 21, (న్యూస్ పల్స్) ప్రపంచ శాంతి, సౌభాగ్యం కోసం శ్రీ పద్మావతి అమ్మవారిని ప్రార్థిస్తూ తిరుచానూరు ఆలయంలో శుక్రవారం నవకుండాత్మక శ్రీ యాగం ప్రారంభమైంది. ఏడు రోజుల పాటు జరగనున్న శ్రీయాగాన్ని కోవిడ్-19 వ్యాప్తి నేపథ్యంలో ఆలయంలోని శ్రీకృష్ణ ముఖ మండపంలో అర్చకులు వేంపల్లి .శ్రీనివాసన్ ఆధ్వర్యంలో ఏకాంతంగా నిర్వహిస్తున్నారు. శ్రీ వేంకటేశ్వర భక్తి ఛానల్ ఈ యాగాన్ని లో ప్రత్యక్ష ప్రసారం చేస్తోంది. ఇందులో భాగంగా శుక్రవారం ఉదయం 9. 30 గంటలకు సంకల్పం తో యాగం ప్రారంభమైంది. మధ్యాహ్నం 1 గంట వరకు యాగశాలలో సంకల్పం, హోమాలు, చతుష్టానార్చన, అగ్ని ప్రతిష్ట, నిత్యపూర్ణాహుతి, నివేదన, వేద విన్నపం, మహామంగళహారతి నిర్వహించనున్నారు. సాయంత్రం 5 నుండి రాత్రి 9 గంటల వరకు చతుష్టానార్చన, శ్రీయాగం హోమాలు, లఘుపూర్ణాహుతి, మహానివేదన, వేద విన్నపం, మహామంగళహారతి చేపట్టి అమ్మవారి ఉత్సవర్లను సన్నిధిలోకి వేంచేపు చేస్తారు.


50 సంవత్సరాల తరువాత

తిరుచానూరు అమ్మవారి ఆలయంలో 50 సంవత్సరాల తరువాత లోక కళ్యాణం కోసం టీటీడీ చైర్మన్ వైవి సుబ్బారెడ్డి దంపతులు ఈ యాగం నిర్వహిస్తున్నారు. ఈ సందర్భంగా అమ్మవారికి సుబ్బారెడ్డి దంపతులు 34 గ్రాముల బంగారు హారాన్ని కానుకగా ఇచ్చారు. అర్చకులు ఉత్సవ మూర్తికి ఈ హారాన్ని అలంకరించారు. జనవరి 27వ తేదీ వరకు యాగం నిర్వహిస్తారు.

## కొవిడ్ థర్డ్ వేవ్‌లో పెరుగుతున్న కేసులు

**రోజుకు కనీసం 200 వరకు నమోదు**

**అప్రమత్తంగా ఉండాలని వైద్యశాఖ హెచ్చరికలు**



కాకినాడ,జనవరి21(: కొవిడ్ థర్డ్ వేవ్‌లో కేసులు ఎక్కువ నమోదు అవుతుండడంతో ప్రజలు తగు చర్యలు తీసుకోవాలని వైద్యాధికారులు కోరారు. తప్పనిసరిగా మాస్క్ ధరించాలని, శానిటైజర్ ఉపయోగిం చుకోవాలన్నారు. సాధ్యమైనంత వరకు గుంపులుగా ఉండవద్దని సూచించారు. సభలు, సమావేశాలు నిషేధించామని, పిల్లలను ఆడుకోవడానికి పార్కులకు, బయటకు పంపవద్దని, కాలనీలో బయట కూర్చుని మాట్లాడడం చేయరాదన్నారు. జలుబు, దగ్గు వంటి లక్షణాలు కనిపిస్తే వ్యాధి నిర్ధారణ పరీక్షలు చేయించు కోవాలన్నారు. మరోవైపు జిల్లాలో కొవిడ్ మహమ్మారి అంతకంతకూ విజృంభిస్తోంది. ఎక్కడికక్కడ వ్యాపిస్తూ వందల మందిని చుట్టేస్తోంది. ఫలితంగా జిల్లాలో కేసుల సంఖ్య క్రమేపీ పెరిగిపోతోంది. రోజూ రెండు వందలకు మించి పాజిటివ్‌లు నమోదవుతున్నాయి. దీంతో ఎక్కడ చూసినా మళ్లీ కొవిడ్ భయం అలుముకుంటోంది. మునుపటి సెకండ్ వేవ్ తరహాలో కేసులు పంజా విసురుతాయోమననే ఆందోళన చెందుతున్నారు. ప్రస్తుతం వైరస్ వేగంతో జిల్లా వైద్య ఆరోగ్య శాఖ బెంబేలెత్తుతోంది. మరోపక్క రాష్ట్ర ప్రభుత్వం ప్రకటించిన నైట్ కర్ఫ్యూ మంగళవారం నుంచి అమల్లోకి వచ్చింది. రాత్రి పదకొండు తర్వాత జిల్లావ్యాప్తంగా పోలీసులు రహదారులపై గస్తీ నిర్వహించారు. వచ్చీపోయే వారి గుర్తింపు కార్డులు తనిఖీ చేశారు. జిల్లాలో పాజిటివ్ కేసులు ఇప్పుడు 200 నుంచి 300 మధ్య నిర్ధారణ అవుతున్నాయి. దీంతో వైరస్ వ్యాప్తి వేగం ప్రజలను, అధికారులను హడలెత్తిస్తోంది. వైరస్‌బారిన పడుతున్న వారిలో ఉపాధ్యాయుల సంఖ్య పెరుగుతుండడం విద్యార్థుల తల్లిదండ్రుల్లో ఆందోళనకు దారితీస్తోంది. సెలవులు ప్రకటించకుండా బోధన కొనసాగిస్తుండడంతో ఎక్కడ పిల్లలు వైరస్ బారిన పడతారోననే ఆందోళన వ్యక్తంచేస్తున్నారు. అధికారులు సైతం వైరస్ బారిన పడు తుండడం కలవరం పెంచుతోంది.పాజిటివ్‌ల తీవ్రత ఇంత పెరుగుతున్నా కొవిడ్ టెస్ట్‌ల సంఖ్య మాత్రం పెంచకపోవడంపై విమర్శలు వ్యక్తమవుతున్నాయి.సెకండ్‌వేవ్‌లో ఎక్కడికక్కడ పీహెచ్‌సీలతోపాటు సంచార బస్సు ల్లోను పరీక్షలు చేశారు. కానీ ప్రస్తుతం టెస్ట్‌లు పెరగకపోవడంతో పల్లెలు, పట్టణాల్లో అనేకమంది ప్రైవేటు ల్యాబ్‌లకు క్యూకడుతున్నారు.అక్కడే రహస్యంగా టెస్ట్‌లు చేయిస్తున్నారు. ప్రస్తుతం వస్తున్న అధికారిక కొవిడ్ కేసుల్లో చాలా వరకు లెక్కల్లోకి రావడం లేదు. కాగా జిల్లాలో వైరస్ తీవ్రత పెరుగుతుండడంతో బాధితుల సంఖ్య ఎక్కువవుతోంది. దీంతో జిల్లావైద్య ఆరోగ్య, రెవెన్యూ శాఖలు కొవిడ్ కేర్ కేంద్రాలు సిద్ధంచేస్తున్నాయి. కాకినాడ బాలాజీ చెరువు సెంటర్‌లోని టీటీడీ కల్యాణమండపాన్ని, జేఎన్టీయూలోని నాగార్జున హాస్టల్‌ను కొవిడ్ కేర్ కేంద్రాలుగా సిద్ధంచేశారు. సామర్లకోటలో మరొకటి అందుబాటులోకి తీసుకువస్తున్నారు. ఇటీవల సంక్రాంతి పండగలో కోడిపందేలు, గుండాటల్లో ఎక్కడా జనం పెద్దగా మాస్కులు ధరించలేదు. దీంతో రానున్న రోజుల్లో కేసులు భారీగా పెరిగే అవ కాశం ఉందని అధికారులు అంచనా వేశారు. కొవిడ్ నియంత్రణ కోసం రాత్రిపూట కర్ఫ్యూను పటిష్టంగా అమలుచేస్తామని జిల్లా ఎస్పీ ఎం.రవీంద్రనాథ్‌బాబు పేర్కొన్నారు.

## తడిసిన ధాన్యం కొనుగోళ్లు చేయాలి

**రైతులకు వెంటనే ఊరట కలిగించాలన్న ధూళిపాళ్ల**

**చివరి గింజవరకు కొంటామన్న కలెక్టర్**



గుంటూరు,జనవరి21(): సకాలంలో ధాన్యం కొనుగోలు చేయకుండా వైసీపీ ప్రభుత్వం రైతులను నట్టేట ముంచిందని మాజీ ఎమ్మెల్యే, టిడిపినేత ధూళిపాళ్ల నరేంద్రకుమార్ ఆగ్రహం వ్యక్తం చేశారు. తడిసిన ధాన్యం కొనుగోళ్లపైనా స్పష్టత ఇవ్వడం లేదన్నారు. మొలకెత్తి పాడైన ధాన్యం చూపి రైతులు కన్నీటి పర్యంతం అవుతున్నా పట్టించుకోవడం లేదన్నారు. రైతుల ఆవేదన చూసి చలించాల్సిన ప్రభుత్వం నిమ్మకునీరెత్తినట్లుగా ఉందని ధ్వజమెత్తారు. ధాన్యం కొనుగోలు చేసి రైతులకు అండగా నిలవాల్సిన ప్రభుత్వం మీనమేషాలు లెక్కిస్తుందని ఆరోపించారు. అకాల వర్షాలకు పంటలను కోల్పోయి రైతులు కన్నీటితో కాలం గడుపుతుంటే చోద్యం చూస్తున్నారన్నారు. దేశానికి అన్నం పెట్టే రైతు కన్నీరు ఎవ్వరికీ మంచిది కాదన్నారు. దెబ్బతిన్న ధాన్యంతో పాటు ప్రతి గింజను కొనుగోలు చేయాలని లేకుంటే రైతు తరపున ఉద్యమిస్తామని హెచ్చరించారు. ఇదిలావుంటే రైతు పండించిన చివరిగింజ వరకు ధాన్యం కొనుగోలు చేయడం జరుగుతుందని కలెక్టర్ వివేక్‌యాదవ్ తెలిపారు. రైతులు ఆందోళన చెందాల్సిన అవసరం లేదని అన్నారు. ప్రతి రైతు నుంచి 40 బస్తాల ధాన్యం కొనుగోలు చేసేవిధంగా సివిల్‌సప్లయిస్ వారికి నివేదిస్తామన్నారు. ధాన్యంలో తేమ శాతం 17కు మించరాదని, రైతులు ధాన్యాన్ని కల్లాల్లో పెట్టుకొని కొనుగోలు కేంద్రాలకు తీసుకురావాలన్నారు. కొనుగోలు చేసిన 21 రోజుల్లో నగదు రైతు అకౌంట్‌ల్లోకి జమ చేయడం జరుగుతుందన్నారు. మద్దతు ధరకే ధాన్యం కొనుగోళ్లు జరుగుతున్నాయని చెప్పారు. ధాన్యం కొనుగోళ్ళ అంశంలో రైతులు సంతోషంగా ఉన్నారని కలెక్టర్ తెలిపారు. తేమశాతం వ్యత్యాసాలు అంటూ రైతులను ఇబ్బంది పెట్టవద్దని తెలిపారు. ఫిబ్రవరి నెల చివరి వరకు నూర్పిడి చేసి కొనుగోలు కేంద్రానికి తీసుకురావాలన్నారు. ఈ-కేవైసీ చేయించుకొని ప్రొక్యూర్‌మెంట్ పోర్టల్‌లో కనిపించని రైతుల రికార్డులను పోర్టల్‌లో కనిపించేలా తగిన చర్యలు తీసుకొంటున్నామన్నారు. రైతుల ధాన్యం ఎలా ఉన్నా తగిన సూచనలు చేసి కొనుగోలు చేస్తామన్నారు.

## మహిళల న్యాయ భద్రతే లక్ష్యంగా..

**ప్రత్యేక మహిళా కోర్టు ఏర్పాటు**

**జిల్లాలో 7వ అదనపు జిల్లా కోర్టు, ప్రత్యేక మహిళా కోర్టును ప్రారంభించిన రాష్ట్ర హైకోర్టు చీఫ్ జస్టిస్**

కడప, కేసుల సత్వర పరిష్కారంతో పాటు.. మహిళల న్యాయ భద్రత కల్పించే లక్ష్యంతోనే.. వైఎస్ఆర్ జిల్లాలో 7వ అదనపు జిల్లా కోర్టు, ప్రత్యేక మహిళా కోర్టును ఏర్పాటు చేయడం జరిగిందని.. రాష్ట్ర హైకోర్టు చీఫ్ జస్టిస్ శ్రీ ప్రశాంత్ కుమార్ మిశ్రా పేర్కొన్నారు.శుక్రవారం స్థానిక జిల్లా కోర్టుల సముదాయ ప్రాంగణంలో నూతనంగా.. 7వ అదనపు జిల్లా కోర్టు, ప్రత్యేక మహిళా కోర్టును.. గౌరవ రాష్ట్ర హైకోర్టు చీఫ్ జస్టిస్ శ్రీ ప్రశాంత్ కుమార్ మిశ్రా.. డిజిటల్ విధానంలో అమరావతి నుండి ప్రారంభించారు. ఇదే కార్యక్రమంలో కృష్ణా జిల్లా మచిలీపట్నంలో నూతన పోక్సో కోర్టుకు కూడా.. ఆయన ప్రారంభోత్సవం చేశారు.కాగా... నూతనంగా ప్రారంభమైన జిల్లా ప్రత్యేక మహిళా కోర్టు, ఏడవ అదనపు జిల్లా కోర్టుకు గౌరవ ఇంచార్జి జడ్జిగా జి.గీతను నియమిస్తూ.. ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర హైకోర్టు ఉత్తర్వులు జారీ చేయడం జరిగింది.ఈ కార్యక్రమంలో గౌరవ అతిథులుగా.. రాష్ట్ర హైకోర్టు నుండి గౌరవ కడప జిల్లా అడ్మినిస్ట్రేటివ్ జడ్జి జస్టిస్ ఎం. మటం వెంకటరమణ, గౌరవ కృష్ణాజిల్లా అడ్మినిస్ట్రేటివ్ జడ్జి.. జస్టిస్ అమానుల్లాఖాన్ లతో పాటు.. గౌరవ జస్టిస్ ఎం. సత్యనారాయణ మూర్తి, గౌరవ జస్టిస్ కొంగర విజయలక్ష్మి, గౌరవ జస్టిస్ బట్టు దేవానందలు పాల్గొన్నారు.అదే కార్యక్రమానికి.. కడప జిల్లా కోర్టు నుండి.. గౌరవ జిల్లా ప్రధాన న్యాయమూర్తి సి.పురుషోత్తం కుమార్, గౌరవ నాల్గవ అదనపు జిల్లా జడ్జి ఎస్. శ్రీనివాస్ శివరాం, గౌరవ ఆరవ అదనపు జిల్లా జడ్జి జి.గీత, గౌరవ ప్రిన్సిపల్ సీనియర్ సివిల్ జడ్జి కృష్ణం కుట్టి, గౌరవ జిల్లా న్యాయసేవాధికార సంస్థ సెక్రటరీ కం సీనియర్ సివిల్ జడ్జి ఎస్. కవిత, గౌరవ అదనపు సీనియర్ సివిల్ జడ్జి ఎస్. హేమలత, గౌరవ జిల్లా మొబైల్ కోర్ట్ జడ్జి ఎం. ప్రదీప్ కుమార్, గౌరవ జిల్లా రెండవ అదనపు జూనియర్ సివిల్ జడ్జి షేక్ రియాజ్, గౌరవ జిల్లా మూడో అదనపు జూనియర్ సివిల్ జడ్జి షేక్ పెద్ద కాశిం, గౌరవ జిల్లా ఎక్సైజ్ కోర్టు జడ్జి కే.మోతిలాల్, జిల్లా ఎస్పీ అన్బురాజన్, జాయింట్ కలెక్టర్ (అభివృద్ధి) సాయి కాంత్ వర్మ, బార్ ప్రెసిడెంట్ సీతారాం, బార్ సెక్రెటరీ అరుణ కుమారి, సంబందిత న్యాయవాదులు, ఇతర శాఖల అధికారులు, న్యాయవాద క్లర్కులు, కోర్టు సిబ్బంది, పోలీస్ సిబ్బంది, కక్షి దారులు తదితరులు పాల్గొన్నారు.

## రోజుకో మలుపు తిరుగుతోన్న వైఎస్ వివేకా హత్య కేసు

అమరావతి జనవరి 21వైఎస్ వివేకా హత్య కేసు మలుపులు తిరుగుతోంది. ఈ హత్య కేసులో నిందితుల మధ్య కొనసాగుతున్న వివాదం కడప జిల్లాలో చర్చనీయాంశంగా మారింది. ఏ4 నిందితుడు డ్రైవర్ దస్తగిరి 164 వాంగ్మూలంపై సహచర నిందితులు మొదటి నుంచి అభ్యంతరం తెలుపుతున్నారు.దస్తగిరి అప్రైవర్ గా మారడానికి అనుమతిచ్చిన కోర్టు ఉత్తర్వులపై కూడా సహచర నిందితులు ఎర్ర గంగిరెడ్డి ఉమాశంకర్ రెడ్డిలు అభ్యంతరం వ్యక్తం చేశారు. ఈ ఉత్తర్వులు రద్దు చేయాలని కోరుతూ వాళ్ళు వేసిన పిటీషన్ పై గురువారం తీర్పును హైకోర్టు రిజర్వ్ చేసింది.వివేకా హత్య కేసులో వైసీపీ రాష్ట్ర కార్యదర్శి దేవిరెడ్డి శివశంకర్ రెడ్డి పేరును నిందితుడు దస్తగిరి చెప్పిన సంగతి తెలిసిందే.

## చిన్నారిపై అత్యాచారం

విశాఖపట్నం జనవరి 21, (న్యూస్ పల్స్) విశాఖ జిల్లా నక్కపల్లి మండలం రాజయ్యపేట గ్రామంలో 11 ఏళ్ల చిన్నారిపై 22 ఏళ్ల యువకుడు అత్యాచారానికి పాల్పడ్డాడు. అత్యాచారం చేసిన నాగేశ్వరరావు పై చిన్నారి తల్లిదండ్రులు నక్కపల్లి పోలీస్ స్టేషన్లో ఫిర్యాదు చేశారు..రాజయ్యపేట గ్రామం చివర జీడి తోటలోకి తీసుకెళ్లి ఈ ఘటనకు పాల్పడ్డాడు.

## విశాఖలో కాంగ్రెస్ సభ్యత్వ కార్యక్రమం

విశాఖపట్నం జనవరి 21, (న్యూస్ పల్స్) విశాఖ నగర కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో సభ్యత్వ నమోదు కార్యక్రమాన్ని ప్రారంభించినట్లు నగర అధ్యక్షుడు గొంప గోవింద్ శుక్రవారం మీడియా సమావేశంలో వెల్లడించారు ఈసందర్భంగా ఆయన మీడియాతో మాట్లాడుతూ విశాఖలోని అన్ని వార్డులో సభ్యత్వ నమోదు కార్యక్రమం నిర్వహిస్తున్నామని ఇకార్యక్రమనికి ఇంచార్జి గ బోడె వెంకట్ పార్లమెంటరీ ఇంచార్జి ని రాష్ట్ర అధ్యక్షుడు సాకే శైలజానాథ్ నియమించారని ఆయన ఆదేశాల అనుగుణంగా ఈరోజు విశాఖలోని పలు వార్డులో వెంకట్ తో కలసి మెంబెర్ షిప్ డ్రైవ్ నిర్వహిస్తున్నామని ప్రతి వార్డులో పర్యటించి సమస్యలను తెలుసుకొని వాటి పరిష్కారానికి కృషిచేస్తామని తెలిపారు. అనంతరం బోడె వెంకట్ మాట్లాడుతూ కాంగ్రెస్ పార్టీ బలోపేతానికి ప్రతి కార్యకర్త ఓ సైనుకుడిలా పనిచేయాలని సభ్యత్వ నమోదు అనంతరం ప్రతి కార్యకర్తకు ఇన్సూరెన్స్ పాలసీ ఇస్తున్నట్లు ప్రకటించారు ప్రతి కార్యకర్త తమ వార్డ్ సమస్యలను తమ దృష్టికి తీసుకురావాలని ప్రజలతో మమేకమై ప్రజల సమస్యలను అడిగి తెలుసుకోని వాటి పరిష్కారానికి కృషిచేయాలని సూచించారు ఇకార్యక్రమంలో పలువురు కాంగ్రెస్ పార్టీ నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు

## ప్రత్యేక మహిళా కోర్టు ప్రారంభం

కడప జనవరి 21, (న్యూస్ పల్స్) కడప జిల్లా కోర్టు ప్రాంగణంలో నూతనంగా ఏర్పాటు చేసిన ప్రత్యేక మహిళా కోర్టు ప్రారంభం అయింది. మహిళా కోర్టు తో పాటు 7 వ అదనపు సెషన్స్ కోర్టును వర్చువల్ విధానంలో చీఫ్ జస్టిస్ ప్రశాంత్ కుమార్ మిశ్రా, జిల్లా పరిపాలన జడ్జి వెంకట రమణ ప్రారంభించారు. కడప నుండి జిల్లా ప్రధాన న్యాయమూర్తి పురుషోత్తమ్ కుమార్ , జిల్లా ఎస్పీ అన్బురాజన్ వీడియో కాన్ఫరెన్స్ లో పాల్గొన్నారు. ఈ న్యాయస్థానం మహిళల పై జరుగుతున్న నేరాల పై ప్రత్యేక కోర్టు ద్వారా విచారించనున్నది.

## కోవిడ్ కేర్ సెంటర్ పద్మావతి నిలయంలో పారిశుద్ధ్య కార్మికుల సమ్మె...

తిరుపతి జనవరి 21, (న్యూస్ పల్స్) శ్రీ పద్మావతి నిలయం లో పారిశుద్ధ్య కార్మికులకు ఆరు నెలలుగా జీతాలు ఇవ్వకపోవడంతో ధర్నా నిర్వహించారు. కొవిడ్ సమస్య ఉధృతంగా ఉన్నప్పటికీ కార్మికులు వారి ప్రాణాలను లెక్కచేయకుండా పారిశుద్ధ్యానికి ఏ లోపం కలగకుండా సేవలు చేసినటువంటి కార్మికులకు ఆరు నెలలుగా జీతాలు ఇవ్వకపోవడంతో వారి జీవనాధారం చాలా కష్టంగా జీవితం గడపాల్సి వస్తుంది ఇందుకు కార్మికులంతా కలిసి ఏ ఐ టి యు సి ఆధ్వర్యంలో ధర్నాలో పాల్గొన్నారు ఇందులో ఏ ఐ టి యు సి జిల్లా ప్రధాన కార్యదర్శి పి .మురళి ,సిపిఐ నగర కార్యదర్శి జె విశ్వనాథన్. నియోజకవర్గ అధ్యక్షుల ని. శ్రీ రాములు, కార్యదర్శి ని . చంద్రశేఖర్ రెడ్డి. శ్రీ శ్రీనివాస పద్మావతి కాంట్రాక్టర్స్ వర్కర్స్ యూనియన్ గౌరవ అధ్యక్షులు ఎం శివ, అధ్యక్షులు ఎస్ సుభాన్ కార్యదర్శి పి సుజాత, కౌసల్య ,నాగ ముని లక్ష్మి ,చంద్రబాబు ,ఆదిలక్ష్మి మరియు పారిశుద్ధ్య కార్మికులు పాల్గొన్నారు

## గుడివాడలో ఉద్రిక్తత

గుడివాడ జనవరి 21, (న్యూస్ పల్స్)కృష్ణా జిల్లా గుడివాడ తెదేపా కార్యాలయం వద్ద ఉద్రిక్తత చోటుచేసుకుంది. ఇటీవల సంక్రాంతి సందర్భంగా గుడివాడలోని కొడాలి కన్వెన్షన్ సెంటర్లో క్యాసినో నిర్వహించారనే అంశంపై తెదేపా నిజనిర్ధారణ కమిటీని ఏర్పాటు చేసింది. ఆ కమిటీ సభ్యులుగా ఉన్న తెదేపా సీనియర్ నేతలు నక్కా ఆనందబాబు, బొండా ఉమా, వర్ల రామయ్య, ఆలపాటి రాజా తదితరులు క్యాసినో నిర్వహించిన ప్రదేశాన్ని పరిశీలించేందుకు గుడివాడ చేరుకున్నారు. తొలుత తెదేపా కార్యాలయానికి చేరుకున్న నేతలు.. అక్కడి నుంచి క్యాసినో నిర్వహించిన ప్రాంతానికి బయల్దేరేందుకు సిద్ధమయ్యారు. కన్వెన్షన్ సెంటర్ పరిశీలనకు అనుమతి లేదంటూ పోలీసులు వారిని అడ్డుకున్నారు. దీంతో తెదేపా నేతలు, పోలీసుల మధ్య వాగ్వాదం చోటుచేసుకుంది. ఆందోళనకు దిగిన తెదేపా నేతలు బొండా ఉమ, ఆలపాటి రాజా, వర్ల రామయ్య తదితరులను పోలీసులు అదుపులోకి తీసుకోవడంతో ఆ పార్టీ శ్రేణులు నిరసనకు దిగాయి. ఇదే సమయంలో తెదేపా నేత బొండా ఉమకు చెందిన కారు అద్దాలను కొందరు ధ్వంసం చేశారు. పోలీసుల సహకారంతోనే వైకాపా కార్యకర్తలు కారు అద్దాలను ధ్వంసం చేశారని తెదేపా నేతలు ఆరోపిస్తున్నారు..

## మొదలైన ఆస్తి పన్ను మోత

విశాఖపట్నం జనవరి 21, (న్యూస్ పల్స్)రాష్ట్రవ్యాప్తంగా అన్ని నగ రాలు, పట్టణాల్లో ప్రజలకు ఆస్తి పన్ను వెూత వెుదలైంది. ఇకపై ప్రతి ఏటా ఇది కొనసాగుతుంది.దశాబ్దాలుగా అమల్లో ఉన్న అద్దె ఆధారిత పన్ను విధానం స్థానే... ఆస్తి మూలధన విలువ ఆధారంగా పన్ను వేసే విధానా న్ని తెచ్చిన ప్రభుత్వం దానిని అమలు చేయడం ప్రారంభించింది. ప్రస్తుతం కడుతున్న పన్నుని 10 నుంచి 15 శాతం పెంచుతూ... ప్రస్తుత ఆర్థిక సంవత్సరం మొదటి ఆరు నెలలకు సంబంధించిన డిమాండ్ నోటీసులను జారీ చేస్తోంది.దీంతో రాష్ట్రంలోని నగరాలు, పట్టణాలు, నగర పంచాయ తీల్లో సుమారు 33.67 లక్షల అసెస్ మెంట్లు ఉండగా... ఇప్పటికే సగానికి పైగా భవనాల యజమానులకు నోటీసులు వెళ్లాయి.ఈ నెలాఖరులోగా మొత్తం నోటీసులు జారీ చేయనున్నా రు.అయితే ప్రభుత్వ నిర్ణయాన్ని తప్పుబడుతూ విశాఖ ప్రజలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.విశాఖలో అత్యది కంగా ఉన్న మురికివాడల్లోనూ పన్ను భారం విదించడం సరికాదని,ప్రభుత్వం ఆర్ది లోటు ఉంటే దాన్ని భర్తీ చేసేందు కు ఆధాయ మార్గాలను అన్వేషించాలే కానీ ప్రజలపై భారాన్ని మోపడం సరికాదని అంటున్నారు.

## వచ్చే ఆదివారం పూర్తి లాక్‌డౌన్ : స్టాలిన్

చెన్నై: కోవిడ్ కేసులు అంతకంతకూ పెరుగుతుండటంపై తమిళనాడు ప్రభుత్తం అప్రమత్తమైంది. ఈనెల 23వ తేదీ ఆదివారంనాడు రాష్ట్రవ్యాప్తంగా పూర్తి లౌక్‌డౌన్‌ను ప్రకటించింది. పెరుగుతున్న కోవిడ్ కేసుల దృష్ట్యా ఈ నిర్ణయం తీసుకున్నట్టు ముఖ్యమంత్రి ఎంకే స్టాలిన్ శుక్రవారంనాడు ప్రకటించారు. ప్రభుత్వ ఉత్తర్వుల ప్రకారం, విమానాశ్రయాలకు, బస్, రైల్వేస్టేషన్లకు ప్రయాణికులను తీసుకువెళ్లే ఆటోలు, టాక్సీలను మాత్రం అనుమతిస్తారు. తమిళనాడులో గురువారం ఒక్కరోజు 28,561 కొత్త కోవిడ్ కేసులు నమోదయ్యాయి. దీంతో రాష్ట్రంలో నమోదైన మొత్తం కేసుల సంఖ్య 30,43,796కు చేరింది.

# క్యాబినెట్ సమావేశంలో నిరుద్యోగుల ఆశల పై నీళ్లు చల్లింది...



. ఎమ్మిగనూరు జనవరి 21, ( విభారె) . ఎమ్మిగనూరు పట్టణంలో రాష్ట్ర వ్యాప్తంగా ఉన్న నిరుద్యగుల ,ప్రభుత్వ ఉద్యోగుల సమస్యలను వెంటనే రాష్ట్ర ప్రభుత్వం పరిష్కరించాలని ఖాళీగా ఉన్న పోస్టులను భర్తీ చేయాలని ఈరోజు జరిగిన రాష్ట్ర క్యాబినెట్ సమావేశంలో నిరుద్యోగుల గురించి మాట్లాడ లేక పోవడం చాలా దారుణమని , ఎన్ ఎస్ యు ఐ జిల్లా అధ్యక్షుడు వీరేష్ యాదవ్ శుక్రవారం పాత్రికేయ సమావేశంలో మాట్లాడుతూ ఈ వైసీపీ ప్రభుత్వం అధికారం లో కి వచ్చినపుడు నుండి ఒక్క ప్రభుత్వ ఉ ద్యోగం కూడా ఇవ్వలేదు అని అన్నారు అంతేకాకుండా పేద బడుగు బలహీన వర్గాలకు చదువు చెప్పే ఉపాధ్యాయులను కూడా పూర్తిగా పీఆర్సీని పెట్టి

## ఎన్ ఎస్ యు ఐనిరుద్యోగులను, ఉద్యోగులనులను మోసం చేస్తున్న రాష్ట్ర ప్రభుత్వం... ఎన్ ఎస్ యు ఐ

పూర్తిగా మోసం చేసింది అని అన్నారు ఈ రాష్ట్ర ప్రభుత్వం కు ప్రజల పైన చిత్త శుద్ధి ఉంటే నిరుద్యోగి విద్యార్థి ని విద్యార్థులకు ఉద్యోగాలు ఇవ్వాలని కోరారు కనీసం రాష్ట్ర ప్రభుత్వం లో ఉన్న ఎమ్మెల్యే ఎంపీ కాపలదారుల వాచ్ మెన్ లకు కూడా జీతాలు దాదాపు పదివేల పైన ఉంటాయి అని కానీ ఈ ప్రభుత్వం లో వాలంటీర్ గా చేసే వారికి కేవలం ఐదు వేల రూపాయలు ఉండటం దారుణం అని అన్నారు అంతేకాకుండా వెంటనే ఈ రాష్ట్రప్రభుత్వం ఏకపక్షంగా ఐ ఆర్ 27 శాతం కంటే అధికంగా ఇవ్వాల్సిన ఫిట్ మెంట్ ను 4శాతం తగ్గించి 23/శాతం ఇవ్వటాన్ని తీవ్రంగా వ్యతిరేకిస్తున్నామన్నారు. అంతేకాకుండా ఈ వైసీపీ వచ్చినపుడు నుండి విద్యారంగం కూడా పూర్తిగా నాశనం అయ్యింది అని అన్నారు ఈ ప్రభుత్వానికి చిత్త శుద్ధి ఉంటే నిరుద్యోగ యువతకు ఉద్యోగాలు, ఉపాధ్యాయులకు ప్రవేశపెట్టిన సర్వీసు నంబర్ 62సరికాదని దానిని వెంటనే తీసివేసి నిరుద్యోగి లను ఆదుకోవాలని డిమాండ్ చేశారు లేని పక్షంలో రాష్ట్ర వ్యాప్తంగా ఆందోళన చేస్తామని హెచ్చరించారు ఈ కార్యక్రమం లో ఎన్ ఎస్ యు ఐ నాయకులు చిన్న రంగస్వామి, షేక్షావలి, అనంత కుమార్, భాస్కర్ అజయ్, పాల్గొన్నారు

# పేరోక్కటి.... తీరోక్కటి



శ్రీకాళహస్తి జనవరి 21, ( విభారె) : శ్రీకాళహస్తీశ్వరా ఆలయ ఆవరణలోని డోనేషన్ కౌంటర్ బక్టులు ఇచ్చే విరాళాల స్వీకరించే కేంద్ర మైన ఆలయానికి వి.ఐ.పి లు ఇతరత్రా సిపార్సు దర్శనాలన్ని ఇక్కడ నుంచే నిర్వహిస్తారు.ఏ.ఈ.ఓ తో పాటు పీ.ఆర్.వో ఏపి.ఆర్.వో లుంటే అనదికారికూ ఓ పాతిక మంది ఉ చిత సేవకులు ఇక్కడ ఉపాది పోందుతుండటూ గమనార్హం ఉన్నత అదికారులు

## అనధికారి సిబ్బంది ధూదా

ఆదేశాల మేరకు ప్రోటోకాల్ కలిగిన వాళ్లకు వీ.ఐ.పి ల హోదాలో ఇక్కడ కు వచ్చే బక్టులు రూ 200 శ్రీఘ దర్శనం గురించి చేప్పడం వాళ్ల వద్ద వీలైవన్నీ టికేట్లు తీయించి సంత్రుప్తికర దర్శనం చేయించడం ఇక్కడ ఉద్యోగుల వీధి ఏవరు ప్రోటోకాల్ ప్రకారం వేళ్ళుతున్నారు..?.ఏవరు టికేట్లు కోనుగోలు చేసి శ్రీ ఘ దర్శనం చేసుకుంటున్నారు....? రోజుకు ఏంత మంది ఉచితం వేళ్తున్నారు...ఈ తరహ లేక్కలన్ని ఏముంుడవు.ప్రోటోకాల్ ఉన్న అనదికారికూ గా తీసు కేళ్లి న అందరు వి.ఐ.పి లే తాజాగా ఇక్కడ కార్యాలయం లో పనిచేసే కోందరు సోంతం గా కండువాలు శాలువా లు జాకేట్లు ప్రసాదాలు ముందుగా కోనుగోలు చేయడం వచ్చిన వి.ఐ.పి ల కు ఇచ్చి భారీ ప్యాకేజి లు పోందు తున్నరన్న విమర్శలు లేక పోలేదు.ఇక్కడ జరిగే అవినీతిని నియంత్రిచడ ా లో ఉన్నత అదికారులు విఫల మౌతున్నారు.ఇక్కడ వచ్చే ఆదాయం తో కోందరు రాజకీయ సిపార్సుల తో వచ్చి చేరి పోతున్నారు.పి. ఆర్. వో కార్యాలయం అంటు చేప్పు కోని ఏంచక్కా అర్ధ మండప దర్శనాలు చేయించుకోని జేబులు నింపుకూ టున్నారు.దీన్ని కట్టడి చేయ కుంటే రానున్న రోజుల్లో ఆలయ హుండీ ఆదాయం మరీూత గా పడి పోయే అవకాశం ఉంది.ఇకనైనా అనదికార సిబ్బంది అడ్డ గోలు వసూళ్ల కు చేక్ పేట్టే విదంగా అదికారులు శ్రద్ధ చూపాల్సి ఉందిపేరోక్కటి.... తీరోక్కటిఅనధికారి సిబ్బంది ధూదాఉదయం న్యూస్ ప్రతినిది ;శ్రీకాళహస్తిశ్రీకాళహస్తిశ్వరా ఆలయ ఆవరణలోని డోనేషన్ కౌంటర్ బక్టులు ఇచ్చే విరాళాల స్వీకరించే కేంద్ర మైన ఆలయానికి వి.ఐ.పి లు ఇతరత్రా సిపార్సు దర్శనాలన్ని ఇక్కడ నుంచే నిర్వహిస్తారు.ఏ.ఈ.ఓ తో పాటు పీ.ఆర్.వో ఏపి.ఆర్.వో లుంటే అనదికారికూ ఓ పాతిక మంది ఉచిత సేవకులు ఇక్కడ ఉపాది పోందుతుండటూ గమనార్హం ఉన్నత అదికారులు ఆదేశాల మేరకు ప్రోటోకాల్ కలిగిన వాళ్లకు వీ.ఐ.పి ల హోదాలో ఇక్కడ కు వచ్చే బక్టులు రూ 200 శ్రీఘ దర్శనం గురించి చేప్పడం వాళ్ల వద్ద వీలైవన్నీ టికేట్లు తీయించి సంత్రుప్తికర దర్శనం చేయించడం ఇక్కడ ఉద్యోగుల వీధి ఏవరు ప్రోటోకాల్ ప్రకారం వేళ్ళుతున్నారు..?.ఏవరు టికేట్లు కోనుగోలు చేసి శ్రీ ఘ దర్శనం చేసుకుంటున్నారు....? రోజుకు ఏంత మంది ఉ చితం వేళ్తున్నారు...ఈ తరహ లేక్కలన్ని ఏముంుడవు.ప్రోటోకాల్ ఉన్న అనది కారికూ గా తీసు కేళ్లి న అందరు వి.ఐ.పి లే తాజాగా ఇక్కడ కార్యా లయం లో పనిచేసే కోందరు సోంతం గా కండువాలు శాలు వా లు జాకేట్లు ప్రసాదాలు ముందుగా కోనుగోలు చేయడం వచ్చిన వి.ఐ.పి ల కు ఇచ్చి భారీ ప్యాకేజి లు పోందు తున్నరన్న విమ ర్శలు లేక పోలేదు.ఇక్కడ జరిగే అవినీతిని నియంత్రిచడ ా లో ఉన్నత అదికారులు విఫల మౌతున్నారు.ఇక్కడ వచ్చే ఆదాయం తో కోందరు రాజకీయ సిపార్సుల తో వచ్చి చేరి పోతున్నారు.పి. ఆర్. వో కార్యాలయం అంటు చేప్పు కోని ఏంచక్కా అర్ధ మండప దంర్శనాలు చేయించుకోని జేబులు నింపుకూ టున్నారు.దీన్ని కట్టడి చేయ కుంటే రానున్న రోజుల్లో ఆలయ హుండీ ఆదాయం మరీూత గా పడి పోయే అవకాశం ఉంది.

# నేడు వీధికుక్కలు తరలింపు

కౌతాళం జనవరి 21, ( విభారె) నేడు మండల కేంద్రం, కాలనీ ల్లో వీధి కుక్కలు తరలిస్తున్నామని ఎవరికైనా ఇంటి కుక్కలు ఉన్నచో వాటిని ఇంట్లో నే కట్టుకోవాలి గ్రామ ప్రజలు సహకరించాలని గ్రామ సర్పంచ్ పాల్ దినకర్ పంచాయతీ కార్యాలయంలో పాత్రికసమావేశంలో తెలిపారు.వారు మాట్లాడుతూ గ్రామాల్లో కాలనీ ల్లో వీధి కుక్కలు వింత వైరస్ సోకి చనిపోతున్నాయి వాటిని చూసి ప్రజలు భయాందోళనకు గురవుతున్నారని కావున గ్రామ పంచాయతీ అధికారుల సూచనల నాయకుల సలహాల మేరకు కాలనీలో గ్రామంలో వీధి కుక్కలు తరలిస్తున్నామని పేర్కొన్నారు. వైరస్ ఉన్న కుక్కలు చూసి భయం ఆందోళన చెందవద్దని సర్పంచ్ పాల్ దినకర్ తెలిపారు. కాలనీ లో ఏదైనా సమస్యలు ఉంటే తమ దృష్టికి తీసుకురావాలని కోరారు.



# ప్రభుత్వ ఉద్యోగులను నిట్ట నిలువునా ముంచిన ఘనత జగన్మోహన్ రెడ్డిదే !!!



మంత్రాలయం జనవరి 21, ( విభారె) : ప్రభుత్వ ఉద్యోగులకు పాదయాత్రలో చేసిన వాగ్దానాలను అధికారంలోకి రాగానే తుంగలో తొక్కి ప్రజలతో పాటు ప్రభుత్వ ఉద్యోగులను కూడా నిట్ట నిలువునా ముంచిన ఘనత జగన్మోహన్రెడ్డి దేనని ఎమ్మిగనూరు నియోజకవర్గ మాజీ శాసన సభ్యులు, రాష్ట్ర టిడిపి ఉపాధ్యక్షులు డా బి. వి. జయనాగేశ్వర రెడ్డి తీవ్రంగా విమర్శించారు . స్థానిక ఎమ్మిగనూరు పట్టణంలోని తన స్వగృహంలో పాత్రికేయులతో సమావేశంలో మాట్లాడుతూ గతంలో టిడిపి ప్రభుత్వ హయాంలో విభజన సమయంలో 16వేల కోట్ల లోటు బడ్జెట్ ఉన్న కూడా ఉద్యోగుల కొరకు 43శాతం పీఆర్సీ ప్రకటిస్తే గగ్గోలు పెట్టి ఉద్యోగులకు ,నేను అండగా ఉంటా అని మాయ మాటలు చెప్పి నేను ఉన్నాను, నేను విన్నాను, నేను చూసాను అని ప్రగల్భాలు పలికి తీరా అధికారంలోకి రాగానే

## మాజీ యంఎల్ ఏ.డా: బి.వి. జయనాగేశ్వర రెడ్డి

కేవలం 23 శాతం పీఆర్సీ ప్రకటించి ఉద్యోగులను నిలువునా మోసం చేసిన ఘనత వైసిపి ప్రభుత్వానికే దక్కిందన్నారు. మాట ఇచ్చి రివర్స్ పీఆర్సీ ఇవ్వడం ఎంత వరకు సబబు అని ప్రశ్నించారు. అశుతోష్ మిశ్రా కమిటీ రిపోర్టును దాచిపెట్టి తమకు కావాల్సినట్టు అధికారులతో రిపోర్టు తెప్పించుకుని ఎలా ఆమోదిస్తారు అని ప్రశ్నించారు. గతంలో అధికారంలోకి వచ్చిన వారంలోపు సీపీయస్ రద్దు చేసి ఉద్యోగుల కళ్ళల్లో ఆనందం చూస్తామని చెప్పి ఇప్పుడు సీపీయస్ మీద అవగాహన లేకుండా అన్నానని మాట తిప్పడమే కాకుండా ఉద్యోగుల కళ్ళల్లో ఆనందం చూస్తానని చెప్పి ఇప్పుడు ఉద్యోగుల కళ్ళల్లో కన్నీరు చూసి పైశాచికానందం పొందుతున్నారు అని ఎద్దేవా చేశారు. మాట తప్పడం మడమ తిప్పడం ఎంతవరకు సమంజసం అని ప్రశ్నించారు. మాట తిప్పం మడమ తిప్పం అని గొప్పలు చెప్పుకునే జగన్మోహన్ రెడ్డి ఇది మాట తిప్పడం మడమ తిప్పినట్టు కాదా అని ప్రశ్నించారు. ఉద్యోగులకు ఎప్పుడు ఫిట్మెంట్ ఎప్పుడు ఐఆర్ కంటే ఎక్కువగా ఉండేదని కానీ వైసిపి అధికారంలోకి వచ్చిన వెంటనే దాన్ని పక్కన పెట్టారని పేర్కొన్నారు. ఉద్యోగులు తమ న్యాయమైన డిమాండ్ల సాధన కోసం ప్రభుత్వానికి వ్యతిరేకంగా పోరాటం కొనసాగిస్తూ ఉంటే వారిని అనగదొక్కాలని వైసిపి ప్రభుత్వం యోచిస్తోంది


# రవితేజ కు విలన్ గా 'రంగస్థలం' బ్యూటీ..?



మాస్ మహారాజా రవితేజ హీరోగా సుధీర్ వర్మ దర్శకత్వంలో తెరకెక్కుతున్న తాజా చిత్రం "రావణాసుర". సంక్రాంతి సందర్భంగా పూజా కార్యక్రమాలతో లాంఛనంగా మొదలైన ఈ సినిమా రెగ్యులర్ షూటింగ్ కూడా ప్రారంభమైంది. ఇందులో రవితేజ లాయర్ పాత్రలో కనిపించనున్నారు. అక్కినేని హీరో సుశాంత్ కీలక పాత్ర పోషించనున్నారు. అయితే ఈ సినిమాలో ఓ యంగ్ బ్యూటీ విలన్ గా నటిస్తోందని టాక్ వినిపిస్తోంది.ఇటీవల కాలంలో హీరోయిన్స్ కేవలం గ్లామర్ రోల్స్ కాకుండా నటనకి ఆస్కారం ఉన్న అన్ని రకాల పాత్రలు చేస్తున్నారు. ఈ క్రమంలో ఇప్పటికే చాలా మంది హీరోయిన్స్ విలన్ పాత్రలు కూడా చేశారు. రవితేజ హీరోగా నటించిన 'క్రాక్' సినిమాలో వరలక్ష్మి శరత్ కుమార్ విలన్ గా నటించగా.. ఇప్పుడు 'రావణాసుర' చిత్రంలో పూజిత పొన్నాడ విలన్ క్యారెక్టర్ చేస్తున్నట్లు సమాచారం.వైజాగ్ ప్రాంతానికి చెందిన తెలుగమ్మాయి పూజిత పొన్నాడ 'దర్శకుడు' చిత్రంతో హీరోయిన్ గా పరిచయమైంది. ఆ తర్వాత 'రంగస్థలం' 'కల్కి' వంటి సినిమాలలో కీలక పాత్రలు పోషించి మంచి గుర్తింపు తెచ్చుకుంది. ప్రస్తుతం అర డజనుకు పైగా చిన్నా చితక చిత్రాల్లో నటిస్తున్న పూజిత.. ఇప్పుడు "రావణాసుర" చిత్రంలో నెగిటివ్ షేడ్స్ ఉన్న పాత్రలో కనిపించనుందని అంటున్నారు.ఇంతకముందు రవితేజ సినిమాలో విలన్ పాత్ర కోసం 'హుషారు' 'జాంబిరెడ్డి' 'బంగార్రాజు' సినిమాలతో తెలుగు ప్రేక్షకులను అలరించిన దక్ష నగార్కర్ ను తీసుకున్నట్టు వార్తలు వచ్చాయి. ఇప్పుడు లోకల్ బ్యూటీ పూజిత పొన్నాడ విలన్ గా చేస్తోందని టాక్ వచ్చింది. మరి ఈ ఇద్దరు ముద్దుగుమ్మల్లో ఎవరు విలనో తెలియాలంటే ఇంకొన్నాళ్ళు ఆగాల్సిందే.ఇకపోతే రావణాసుర" సినిమాలో పూజిత పొన్నాడ - దక్ష నగర్కార్ లతో పాటుగా అనూ ఇమాన్యుల్ - ఫరియా అబ్దుల్లా - మేఘా ఆకాశ్ వంటి మరో ముగ్గురు హీరోయిన్లు నటిస్తున్నారు. శ్రీకాంత్ విస్సా ఈ యాక్షన్ థ్రిల్లర్ కు కథ అందిస్తున్నారు. అభిషేక్ పిక్చర్స్ మరియు ఆర్టీ టీమ్ వర్క్స్ బ్యానర్స్ అభిషేక్ నామా భారీ బడ్జెట్ తో ఈ చిత్రాన్ని నిర్మిస్తున్నారు.

# దీపికా బికినీ అందాలు - లిప్ లాక్స్ తో నిండిపోయిన 'గెహ్రైయాన్'

కరోనా నేపథ్యంలో అనేక హిందీ చిత్రాలు డైరెక్ట్ ఓటీటీ రిలీజ్ అయ్యాయి. థియేటర్లలో విడుదల చేసిన సినిమాలకు కూడా పెద్దగా ఆదరణ దక్కకపోవడంతో చాలామంది ఫిలిం మేకర్స్ ఓటీటీ రిలీజ్ కే మొగ్గు చూపుతున్నారు. ఇప్పుడు 'కపూర్ అండ్ సన్స్' ఫేమ్ శకున్ బత్రా దర్శకత్వంలో తెరకెక్కిన "గెహ్రైయాన్" సినిమా కూడా థియేట్రికల్ రిలీజ్ స్కిప్ చేసి నేరుగా ఓటీటీ వేదికగా ప్రేక్షకుల ముందుకు వస్తోంది."గెహ్రాయాన్" చిత్రంలో బాలీవుడ్ స్టార్స్ దీపికా పదుకొణె - అనన్య పాండే - సిద్ధాంత్ చతుర్వేది ప్రధాన పాత్రలు పోషించారు. వాయ్ కామ్ 18 స్టూడియోస్ మరియు ధర్మ ప్రొడక్షన్స్ సంస్థలు సంయుక్తంగా ఈ చిత్రాన్ని నిర్మించాయి. అమెజాన్ ప్రైమ్ వీడియో ఓటీటీ ఫ్లాట్ ఫార్మ్ లో వాలెంటైన్స్ వీక్ లో 2022 ఫిబ్రవరి 11న ఈ సినిమా విడుదల కానుంది. ఈ నేపథ్యంలో తాజాగా 'గెహ్రైయాన్' ట్రైలర్ ను మేకర్స్ రిలీజ్ చేశారు.ట్రైలర్ చూస్తుంటే మూడు పాత్రల మధ్య భావోద్వేగాలు.. విచిత్రమైన బంధాల నేపథ్యంలో సాగే ఓ వైవిధ్యమైన కథతో ఈ మూవీ తెరకెక్కుతోందని తెలుస్తోంది. అలీషా (దీపికా పదుకొణె) తన బాధ్యత గురించి పట్టించుకోని భర్తతో కలిసి జీవించడంలో ఇబ్బంది పడుతూ కనిపిస్తోంది. అదే సమయంలో ఆమె కజిన్ తియా (అనన్య పాండే) తన ప్రియుడు జైన్ (సిద్ధాంత్ చతుర్వేది) తో పెళ్లికి రెడీ అవుతుంది. అయితే అనన్య తన ఫియాన్సీ సిద్ధాంత్ ను దీపికా కు పరిచయం చేసిన తర్వాత.. ఆ పరిచయం దీపికా - సిద్ధాంత్ మధ్య లైంగిక సంబంధానికి దారి తీసినట్లు కనిపిస్తోంది. ఈ విషయం బయటపడ్డాక వాళ్ళ జీవితాల్లో ఎలాంటి పరిణామాలు చోటుచేసుకున్నాయనేదే మిగిలిన కథ.'గెహ్రాయాన్' సినిమాలో దీపికా పదుకొణె నటన అందరినీ మంత్రముగ్ధులను చేయడమే కాకుండా.. ఆమె బికినీ అందాలు మరియు లిప్ కిస్సింగ్ లు షాక్ కి గురి చేస్తున్నాయి. ఒకే సమయంలో ప్రేమను బాధను చూపిస్తూ అద్భుతమైన పెరఫార్మెన్స్ చూపించింది. మరోవైపు అనన్య పాండే మరియు సిద్ధాంత్ కూడా తమ స్క్రీన్ ప్రెజెన్స్ తో ఆకట్టుకున్నారు. ధైర్య కర్వా - నజీరుద్దీన్ షా కీలక పాత్రల్లో కనిపిస్తున్నారు. ట్రైలర్ లో విజువల్స్ - బ్యాగ్రౌండ్ స్కోర్ ప్రధాన ఆకర్షణగా నిలిచాయి. థియేట్రికల్ రిలీజ్ అయిన "83" సినిమా బాక్సాఫీస్ వద్ద ఆశించిన స్థాయిలో వసూళ్ళు రాబట్టలేకపోయింది. మరి ఇప్పుడు ఓటీటీలో రాబోయే దీపికా పదుకునే 'గెహ్రైయాన్' సినిమా ఎలాంటి విజయాన్ని అందిస్తుందో చూడాలి.



# ఐకాన్ స్టార్ బ్రాండ్ వచ్చేస్తోంది

వెండితెరపై తమదైన స్టైల్ తో ఆకట్టుకుంటున్న స్టార్స్ కొందరు తమ బ్రాండ్ లని ప్రత్యేకంగా సృష్టిస్తూ మార్కెట్ లోకి వదులుతున్నారు. ఇప్పటికే బాలీవుడ్ లో చాలా మంది స్టార్స్ ఇలా తమ ప్రత్యేక బ్రాండ్ లని క్రియేట్ చేసి వాటిని తమ క్రేజ్ కి తగ్గట్టుగా వైరల్ చేస్తున్నారు. టాలీవుడ్ లో ఇప్పటికే రౌడీ స్టార్ విజయ్ దేవరకొండ తన క్రేజ్ నే రౌడీ బ్రాండ్ గా మార్చి వస్త్ర ప్రంచంలో సంచలనం సృష్టిస్తున్న విషయం తెలిసిందే.రౌడీ బ్రాండ్ కి భారీ క్రేజ్ వుంది. ఆ క్రేజ్ కి తగ్గట్టే న్యూ స్టైల్ డ్రెస్ డిజైన్స్ ని మార్కెట్ లోకి దించేసి తన సత్తా చాటుకుంటున్నారు విజయ్ దేవరకొండ. యూత్ లో ఆయనకున్న క్రేజ్ కారణంగా రౌడీ బ్రాండ్ హాట్ సేల్ అవుతూ వస్త్ర ప్రపంచంలో సంచలనం సృష్టిస్తోంది. 'అల వైకుంఠపురములో' టైమ్ లో బన్నీకి విజయ్ దేవరకొండ తన బ్రాండ్ డ్రెస్ ని గిఫ్ట్ గా అందించి వార్తల్లో నిలిచిన విషయం తెలిసిందే.ఇదే తరహాలో స్టార్ హీరోయన్ సమంత సాకీ పేరుతో కొత్త బ్రాండ్ ని ప్రారంభించి వస్త్ర ప్రపంచంలోకి ప్రవేశించారు. సామ్ బ్రాండ్ కూడా హ్యూజ్ సక్సెస్ కావడంతో పాన్ ఇండియా స్టార్ ఐకానిక్ హీరో అల్లు అర్జున్ కూడా ఈ రంగంలోకి ప్రవేశిస్తున్నారు. ఏఏ బ్రాండ్ పేరుతో వస్త్ర ప్రపంచంలోకి ప్రవేశిస్తున్నారు. ఇందుకు సంబంధించిన ఏర్పాట్లు కూడా చక చకా జరిగిపోతున్నపట్టుగా తెలుస్తోంది.అయితే తను ప్రారంభించబోయే ఏఏ బ్రాండ్ డ్రెస్సెస్ అందరికి అందుబాటులో వుండేలా ప్లాన్ చేస్తున్నారట. ప్రైజ్ విషయంలో చాలా జాగ్రత్తలు తీసుకుంటూ ప్రతీ ఒక్కరికీ తన బ్రాండ్ డ్రెస్సెస్ అందుబాటులో లభించేలా ఏర్పాట్లు చేస్తున్నారని తెలిసింది. బన్నీ అంటే స్టైల్ కి మారు పేరు. అదే తన బ్రాండ్ లో కనిపిస్తూనే అందరికి ఆమోదయోగ్యమైన రేట్ లలో అందుబాటులో వుండేలా బన్నీ నిర్ణయం తీసుకుంటున్నారని చెబుతున్నారు.ఇప్పటికే 'పుష్ప' తో పాన్ ఇండియా లెవెల్లో సంచలనం సృష్టించడమే కాకుండా వసూళ్ల పరంగానూ సరికొత్త రికార్డులు సృష్టిస్తున్న నేపథ్యంలో బన్నీ ప్రారంభించనున్న ఏఏ బ్రాండ్ పాన్ ఇండియా స్థాయిలో వైరల్ అవడం ఖాయం అని ఆయన అభిమానులు చెబుతున్నారు.




# టీ20 ప్రపంచకప్‌లో టీమిండియా షెడ్యూల్ ఇదే.. పాక్‌పై ప్రతీకారం తీర్చుకోనుందా?



టీ20 ప్రపంచకప్-2022కు సంబంధించిన షెడ్యూల్‌ను ఐసీసీ విడుదల చేసిన సంగతి తెలిసిందే. ఇక భారత్ జట్టు తమ తొలి మ్యాచ్‌లో చిరకాల ప్రత్యర్థి పాకిస్తాన్‌తో తలపడనుంది. దాయాదుల పోరు అక్టోబర్ 23న ఐకానిక్ మెల్‌బోర్న్ క్రికెట్ గ్రౌండ్‌లో జరగనుంది. టీ20 ప్రపంచకప్-2022 అక్టోబర్ 16నుంచి నవంబర్ 13 వరకు జరగనుంది. మొత్తం 8 జట్లను రెండు గ్రూపులుగా ఐసీసీ విభజించింది. గ్రూప్-2లో టీమిండియా,పాకిస్తాన్,దక్షిణాఫ్రికా, బంగ్లాదేశ్ జట్లు ఉన్నాయి.కాగా టీ20 ప్రపంచకప్-2022లో టీమిండియా షెడ్యూల్‌పై ఓ లుక్కేద్దాం. అక్టోబర్ 23న మెల్‌బోర్న్ వేదికగా పాకిస్తాన్‌తో తలపడనుంది. అక్టోబర్ 30న పార్ల్ వేదికగా దక్షిణాఫ్రికాతో, నవంబర్ 2న బంగ్లాదేశ్‌తో ఆడనుంది. ఇక గ్రూపు-బిలో విజేతతో నవంబర్ 6న చివరి లీగ్ మ్యాచ్‌లో తలపడనుంది. భారత్ టీ20 వరల్డ్‌కప్ షెడ్యూల్‌ను స్టార్ స్పోర్ట్స్ ట్విటర్‌లో పోస్ట్ చేసింది.

# పుష్ప 'శ్రీవల్లీ' పాటకు వార్నర్ అదిరిపోయే స్టెప్పులు

ఆస్ట్రేలియన్ విధ్వంసకర క్రికెటర్ డేవిడ్ వార్నర్ మరోసారి తనదైన స్టైల్లో మెరిశాడు. ఇప్పటికే పుష్ప సినిమా డైలాగ్‌తో పాటు "ఏయ్ బిడ్డా.. ఇది నా అడ్డా" పాటకు స్టెప్పులేసిన వార్నర్.. తాజాగా శ్రీవల్లీ పాటకు అదిరిపోయే స్టెప్పులేశాడు. అచ్చం అల్లు అర్జున్‌ను గుర్తుచేస్తూ అతనిలానే పాదాలను కదిలించిన వార్నర్ తన స్టెప్పులతో ఆకట్టుకున్నాడు. ఈ వీడియోను వార్నర్ తన ఇన్‌స్టా?గ్రామ్‌లో షేర్ చేయగా.. కొద్ది నిమిషాల్లోనే వైరల్‌గా మారింది. అంతకముందు పుష్ప సినిమాలోని యవ్వా తగ్గేదేలే అన్న డైలాగ్‌ను వార్నర్ తన మేనరిజంతో చెప్పగా.. అల్లు అర్జున్ వెంటనే రియాక్టయ్యాడు. యవ్వ తగ్గేదేలే వార్నర్.. అంటూ క్యాప్షన్ జత చేశాడు. వార్నర్ స్టెప్పులపై మీరు ఒక లుక్కేయండి..



EDITED, PRINTED,PUBLISHED AND OWNED BY AVULA VIJAYA BHASKARA REDDY PRINTED AT SRI SANTOSH PRINTERS SHOP NO. 67-58/A2,OPP TAMIL NADU MERCANTILE BANK, OLD BUSTAND, KURNOOL- 518 001. ANDHRA PRADESH.
PUBLISHED FROM AVULA HUSSAIN REDDY COLONY,7-5-230, NANDYAL ROAD ALLAGADDA-518 543. KURNOOL DISTRICT. ANDHRA PRADESH. EDITOR : AVULA VIJAYA BHASKARA REDDY. RNI No : APTEL/2019/77190